J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

లాయర్

సంపుటి : 46 సంచిక : 22 30.10.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

రామాయపట్నం సమీపంలో

బీపీసీఎల్ రిఫైనరీకి అనుమతులు

ప్రధాని మోడీ చేతులమీదుగా త్వరలో శంకుస్థాపన!

నెల్లూరుజిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో కీలక ముందడుగుగా భావిస్తున్న రామాయపట్నం పోర్టు సమీపంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) రిఫైనరీ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లభించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం వెల్లడించారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు మంజూరయ్యాయని, కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జెడ్)కు సంబంధించిన అనుమతులు కూడా వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఈ అనుమతులతో రిఫైనరీ ప్రాజెక్టు ఏర్పాటుకు కీలకమైన ముందడుగు పడినట్లయింది. ప్రాజెక్టుకు త్వరలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతులమీదుగా శంకుస్థాపన జరగనున్నట్లు సమాచారం. రిఫైనరీ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నెల్లూరుజిల్లాలో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు రవాణా, లాజిస్టిక్స్, అనుబంధ పరిశ్రమలకు ఊతం లభించవచ్చని పారిశ్రామికవర్గాలు భావిస్తున్నాయి. రామాయపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడే అవకాశముంది. అయితే, ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమయ్యే తేదీ, పెట్టుబడి వ్యయం, ఉత్పత్తి సామర్థ్యం, ఉపాధి కల్పనపై అధికారిక వివరాలు వెల్లడికావాల్సి ఉంది. పర్యావరణ పరిరక్షణ నిబంధనల అమలు, స్థానిక ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కూడా ప్రాజెక్టు అమలులో కీలక అంశాలుగా నిలవనున్నాయి.

దీర్ఘకాలంగా పారిశ్రామిక అభివృద్ధిపై ఆశలు పెట్టుకున్న నెల్లూరుజిల్లా ప్రజలకు ఇదొక పెద్ద శుభవార్త. అనుమతుల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ప్రధాని చేతులతో శంకుస్థాపన, నిర్మాణ పనుల ప్రారంభ వివరాలపై స్పష్టత రావలసివుంది.

మేయర్ బరిలో వీరే!

నెల్లూరు నగర మేయర్ బరిలో పలువురు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు, కొంతమంది స్వతంత్ర అభ్యర్థులు కూడా రంగంలోకి నిలిచారు. ఆనం విజయకుమార్‌రెడ్డి వైసీపీ తరఫున ఎన్నికల బరిలో నిలవగా, బీఎస్పీ తరఫున జానకిప్రసాద్, టీడీపీ తరఫున పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, ఐఎన్‌సి తరఫున సయ్యద్ ముజీర్ రోజ్‌దార్, బీసీవైపీ తరఫున ఎస్‌ఎస్ యాదవ్‌లు పోటీలో ఉన్నారు. అదేవిధంగా, ఏలూరు లక్ష్మీప్రశాంతి, కాకు మురళిరెడ్డి, నక్కా జయశ్రీ, పిన్నమిరాజు శివనాగప్రసాద్, మల్లెల శ్రీహరి, నగ్మా మహమ్మద్, చంద్రశేఖర్ వినుకొండ, షేక్ ముజీబ్, సయ్యద్ కాశిఫ్, సయ్యద్ హాసన్ అహ్మద్ హుస్సేనిలు స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల రంగంలో నిలిచారు.

ఏకగ్రీవమైన..కార్పొరేటర్ అభ్యర్థులు

నెల్లూరు నగర కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థు లుగా నిలిచిన 8మంది తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవ మయ్యారు. 36వ డివిజన్‌కి చెందిన బుద్దా సుప్రజ, మన్నేపల్లి నీలిమ్మ (38వ డివిజన్), అత్తివరపు మల్లీశ్వరి (39వ డివిజన్), ఆర్. అభిషేక్ (40వ డివిజన్), పల్నాటి అపర్ణ (41వ డివిజన్), భీమినేని వేదశ్రీ (44వ డివిజన్), షేక్ షంషుద్దీన్ (46వ డివిజన్), తాళ్ళూరు అవినాష్ (47వ డివిజన్)లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

ఓటు హక్కు..మన ఆయుధం

ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించిన వరమని, అదొక వజ్రాయుధమని జనవిజ్ఞాన వేదిక కావలి పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు చెప్పారు. డా.బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరునికి అత్యంత శక్తివంతమైన ఆయుధంగా ఓటు హక్కును ప్రసాదించారన్నారు. నిజాయితీ కలిగిన అభ్యర్థులను ఎన్నుకోవాలని ఆయన సూచించారు.

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే..

వ.స	వార్డు	అభ్యర్థిపేరు	పార్టీ
1	1	కుడుముల చిరంజీవి	టీడీపీ
2	1	షేక్ కరిముల్లా	వైయస్సార్సీపీ
3	2	మొహమ్మద్ జావీద్	టీడీపీ
4	2	యనమల కిషన్	వైయస్సార్సీపీ
5	3	మేకల మధుపావని	టీడీపీ
6	3	సుజనా రాచూరు	వైయస్సార్సీపీ
7	4	ఇండ్ల మమత	వైయస్సార్సీపీ
8	4	మాలికల నాగమణి	టీడీపీ
9	5	ఇంగిలీల అబ్రహం	టీడీపీ
10	5	తొగురు జాషువా	వైయస్సార్సీపీ
11	6	బత్తల శ్రీకాంత్	జనసేన
12	6	మల్లికార్జునరావు ఈటె	వైయస్సార్సీపీ
13	6	నాగేంద్ర కొండిలిని	బీసీవైపీ
14	6	నర్సాపురం సుకుమార్	బీజేపీ
15	7	లక్ష్మి సిరిగిరి	బీజేపీ
16	7	మేకల ప్రవల్లిక	ఇండిపెండెంట్
17	7	మిట్టా శ్రీదేవి	వైయస్సార్సీపీ
18	7	సంక్రాంతి నీలిమా	ఇండిపెండెంట్
19	8	మామిడాల మధు	టీడీపీ
20	8	మస్తానమ్మ షేక్	వైయస్సార్సీపీ
21	8	షేక్ ఆర్షియా	ఇండిపెండెంట్
22	8	షేక్ మీరాబాషా	ఇండిపెండెంట్
23	9	మణికంఠ మచ్చ	వైయస్సార్సీపీ
24	9	తాళ్ళూరి శశికుమార్	టీడీపీ
25	10	కిన్నెర కోటేశ్వరి	టీడీపీ
26	10	పైడిమాని సుజన	ఇండిపెండెంట్
27	11	కొండా గీతిక	టీడీపీ
28	11	అల్లూరు సౌజన్య	వైయస్సార్సీపీ
29	12	కిన్నెర సాగర్	టీడీపీ
30	12	పెళ్ళూరు శ్రీనివాసులు	వైయస్సార్సీపీ
31	12	పెళ్ళూరు విజయలక్ష్మి	ఇండిపెండెంట్
32	12	తిరుపతి సాయియజ్ఞేష్	ఇండిపెండెంట్
33	13	నెల్వాయి కామాక్షి	వైయస్సార్సీపీ
34	13	పత్తిపాటి కావ్య	బీజేపీ
35	13	సానా కుమారి	ఇండిపెండెంట్
36	14	ఈదర ధనుజ	వైయస్సార్సీపీ
37	14	కువ్వరపు బాలాజీ	టీడీపీ
38	15	గుర్రం కెజియాకుమారి	జనసేన
39	15	ఆముదాల శుష్మప్రియ	ఇండిపెండెంట్
40	15	బెల్లంకొండ సుధవల్లి	ఇండిపెండెంట్
41	15	గాలి సునీత	ఇండిపెండెంట్
42	15	మొగళ్ళపల్లి చిన్మయిగుప్తా	ఇండిపెండెంట్
43	15	మొగళ్ళపల్లి కామాక్షిదేవి	వైయస్సార్సీపీ
44	15	మొగళ్ళపల్లి లావణ్య	ఇండిపెండెంట్
45	15	ఉప్పల జమున	ఇండిపెండెంట్
46	16	దొంతాల పార్వతమ్మ	వైయస్సార్సీపీ
47	16	కమ్మ కళ్యాణి	టీడీపీ
48	16	మొగళ్ళపల్లి కామాక్షిదేవి	ఇండిపెండెంట్
49	16	షేక్ అలీమా	ఐఎన్‌సి
50	16	తోట రాజేశ్వరి	ఇండిపెండెంట్
51	17	గొడ్లవేటి వెంకటేశ్వర్లు	వైయస్సార్సీపీ
52	17	కాకర్ల తిరుమలనాయుడు	టీడీపీ
53	17	పెట్టె అజయ్‌కుమార్	ఇండిపెండెంట్
54	17	వేమసాని స్వాతి	బీసీవైపీ
55	18	గొడ్డేటి లక్ష్మి	టీడీపీ
56	18	కొండమారెడ్డి ఆశ్రిత	వైయస్సార్సీపీ
57	18	పిట్ల దివ్య	సిపిఐ(ఎం)
58	19	ద్రోణాదుల హారిక	ఇండిపెండెంట్
59	19	ద్రోణాదుల యలమందరెడ్డి	వైయస్సార్సీపీ
60	19	కర్తం ప్రతాప్‌రెడ్డి	టీడీపీ
61	19	మన్నెపల్లి ఉమాదేవి	ఇండిపెండెంట్
62	20	అనుమారెడ్డి శరత్‌కుమార్‌రెడ్డి	వైయస్సార్సీపీ
63	20	గణేశం వెంకటేశ్వర్లు	టీడీపీ
64	20	కొప్పోలు వెంకటరమణరెడ్డి	సీపీఐ(ఎం)
65	20	మెంట శ్రీనివాసులు	ఇండిపెండెంట్
66	20	పెద్దిశెట్టి ప్రతిమ	ఇండిపెండెంట్
67	20	షేక్ ఫయాజ్	ఇండిపెండెంట్
68	20	సయ్యద్ అబిద్ హుస్సేన్	ఐఎన్‌సి
69	21	బూచి దీప్తి	సీపీఐ(ఎం)
70	21	గునుకల విజయలక్ష్మి	జనసేన
71	21	జంగ ప్రమీల	ఇండిపెండెంట్
72	21	నతలం రేఖ	ఇండిపెండెంట్
73	21	సగిలి అరుణ	వైయస్సార్సీపీ
74	22	వేనాటి శ్రీకాంత్‌రెడ్డి	వైయస్సార్సీపీ
75	22	ఉచ్చి భువనేశ్వరిప్రసాద్	టీడీపీ
76	23	కాయల తిరుపతి	టీడీపీ
77	23	ఊటుకూరి కృష్ణచైతన్య	వైయస్సార్సీపీ
78	24	భట్ట సంధ్య	వైయస్సార్సీపీ
79	24	కంభంపాటి హేమలత	సీపీఐ(ఎం)
80	24	ఊటుకూరు చంద్రుప్రియ	టీడీపీ
81	25	దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి	టీడీపీ
82	25	ఎన్ భానుప్రకాష్‌రెడ్డి	వైయస్సార్సీపీ
83	26	నున్న గాయత్రి	టీడీపీ
84	26	పారా ఝాన్సీ	వైయస్సార్సీపీ
85	27	నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి	టీడీపీ
86	27	సందీప్ బిరదవోలు	వైయస్సార్సీపీ
87	28	నన్నం శ్రీనివాసులు	టీడీపీ
88	28	తాళ్లూరి సురేష్‌బాబు	వైయస్సార్సీపీ
89	29	మురళీకృష్ణ నాగిశెట్టి	జనసేన
90	29	గరికి ప్రమోద్‌కుమార్	ఇండిపెండెంట్
91	29	మొయిళ్ల జోసెఫ్ సురేష్‌రెడ్డి	వైయస్సార్సీపీ
92	29	పటాన్ జిలానీఖాన్	సీపీఐ
93	29	పోతురాజు శీను	సీపీఐ(ఎం)
94	30	మల్లెల శ్రీహరి	ఇండిపెండెంట్
95	30	మాసా శేఖర్	ఇండిపెండెంట్
96	30	నూనె రుషికేష్‌యాదవ్	జనసేన
97	30	షేక్ ఖాదర్‌బాషా	వైయస్సార్సీపీ
98	31	గెట్టిబోయిన రాజేంద్రప్రసాద్	ఇండిపెండెంట్
99	31	మేకల మనోజ్‌కుమార్‌రెడ్డి	వైయస్సార్సీపీ
100	31	యరబోలు రాజేష్	బీజేపీ
101	32	ఆదిరెడ్డి ప్రసాద్	వైయస్సార్సీపీ
102	32	మేకల మధు	టీడీపీ
103	33	అరవ శాంతి	టీడీపీ
104	33	గోవిందు సాహితీప్రపూర్ణ	సీపీఐ(ఎం)
105	33	వడ్లపూడి అఖిల	వైయస్సార్సీపీ
106	34	బోనబోయిన చాముండేశ్వరి	టీడీపీ
107	34	షేక్ కరీమున్నీసా	ఐఎన్‌సి
108	34	షేక్ ముంతాజ్	వైయస్సార్సీపీ
109	35	దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
110	35	గలజు శివ ఆచారి	ఇండిపెండెంట్
111	35	మూలే బాల వెంగల్‌రెడ్డి	వైయస్సార్సీపీ
112	35	సుర్రై భాను	ఐఎన్‌సి
113	35	వీర్ల శ్రీనివాసులు	సీపీఐ(ఎం)
114	37	షేక్ అబ్దుల్ రసూల్	టీడీపీ
115	37	షేక్ రఫీ	సీపీఐ(ఎం)
116	37	షేక్ సతార్	వైయస్సార్సీపీ
117	42	మండల కామాక్షి	బీజేపీ
118	42	మండల పావని ప్రబాలిక	ఇండిపెండెంట్
119	42	సైదాని బేగం సయ్యద్	వైయస్సార్సీపీ
120	43	మొగరాల శోభ	బీజేపీ
121	43	రావులపల్లి వెంకటజ్యోతి	వైయస్సార్సీపీ
122	45	చిట్లూరు సుందర్‌రామిరెడ్డి	జనసేన
123	45	గాజుల కేశవ నారాయణ	ఇండిపెండెంట్
124	45	కేసరి శామ్‌సింగ్	వైయస్సార్సీపీ
125	45	కొండపల్లి కోటేశ్వరరావు	ఇండిపెండెంట్
126	48	పటాన్ గౌసియా బేగం	టీడీపీ
127	48	షేక్ హబీబునిసా	ఇండిపెండెంట్
128	48	షేక్ షర్మిల	ఐఎన్‌సి
129	48	సయ్యద్ మొబీనా	వైయస్సార్సీపీ
130	49	కంచర్ల హరీష్	ఇండిపెండెంట్
131	49	మద్ద బార్నాబాస్	టీడీపీ
132	49	వారిని సి	వైయస్సార్సీపీ
133	50	ఎంబేటి అనూష	వైయస్సార్సీపీ
134	50	నందిపాటి శైలజ	టీడీపీ
135	51	బెజవాడ భువనేశ్వరి	టీడీపీ
136	51	హేమలత రాచపూడి	వైయస్సార్సీపీ
137	52	నాదెళ్ల శారద	వైయస్సార్సీపీ
138	52	పున్నపు విష్ణుప్రియ	టీడీపీ
139	53	బొందిలి నాగలక్ష్మి	వైయస్సార్సీపీ
140	53	కొప్పోలు నవ్యలక్ష్మి	జనసేన
141	53	ఎస్‌కె నూరత్ బేగం	ఐఎన్‌సి
142	54	అన్నంగి సమత	టీడీపీ
143	54	బుచ్చిరెడ్డి సుధారాణి	ఇండిపెండెంట్
144	54	సయ్యద్ షబానా పర్వీన్	వైయస్సార్సీపీ
145	54	వేలూరు నిశ్చిత	ఇండిపెండెంట్
146	55	గండవరం విశాలక్ష్మి	టీడీపీ
147	55	మహ్మద్ నస్రీనా తబసుమ్	వైయస్సార్సీపీ
148	56	కుంచాల కృష్ణవేణి	వైయస్సార్సీపీ
149	56	నందిమండలం వెంకట శ్రీదివ్య	టీడీపీ
150	57	షేక్ అస్మా	వైయస్సార్సీపీ
151	57	షేక్ హస్మా	ఇండిపెండెంట్
152	57	షేక్ జరీనా	ఐఎన్‌సి
153	57	షేక్ షబానా బేగం	టీడీపీ
154	58	షేక్ హుస్నా సిద్దిఖ్	వైయస్సార్సీపీ
155	58	షేక్ కరిముల్ల	టీడీపీ
156	58	షేక్ షా అలీహుస్సేన్	ఇండిపెండెంట్
157	59	అబిద్	ఐఎన్‌సి
158	59	చీదెళ్ల కిషన్	వైయస్సార్సీపీ
159	59	దరిసి హరికృష్ణ	టిడిపి
160	59	కొకు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి	ఇండిపెండెంట్
161	60	ముంగమూరు ఆశ్రిత్‌రెడ్డి	వైయస్సార్సీపీ
162	60	రఘునాథ రాజు కూరపాటి	బీజేపీ
163	60	వేదం రామచంద్రన్	ఇండిపెండెంట్
164	61	రంగమయూర్‌రెడ్డి ఆనం	టీడీపీ
165	61	వేలూరు ఉమామహేష్	వైయస్సార్సీపీ
166	62	పొట్లూరి రామకృష్ణ	టీడీపీ
167	62	షేక్ ఫజల్ అహ్మద్	ఇండిపెండెంట్
168	62	షేక్ మీరా	వైయస్సార్సీపీ
169	62	షేక్ రబ్బానీ	ఇండిపెండెంట్
170	62	షేక్ షీరిన్	ఇండిపెండెంట్
171	62	షేక్ జహూర్‌అహమద్	ఇండిపెండెంట్
172	63	మహమ్మద్ జుబైరుద్దీన్	టీడీపీ
173	63	షేక్ తహసీన్	వైయస్సార్సీపీ
174	63	షేక్ జహీర్ అహ్మద్	ఇండిపెండెంట్
175	64	మహమ్మద్ కౌసర్	వైయస్సార్సీపీ
176	64	షేక్ నజిమా	టీడీపీ
177	64	షేక్ షహీనా	ఇండిపెండెంట్
178	64	షేక్ సోఫియా	ఇండిపెండెంట్
179	64	శివపురం చిన్మయ్	ఇండిపెండెంట్
180	65	ధర్మవరం గణేష్‌కుమార్	టీడీపీ
181	65	ఖజానా వెంకటశేషయ్య	వైయస్సార్సీపీ
182	65	శ్రీమంతుల కిషోర్	ఇండిపెండెంట్
183	66	కప్పిర రేవతి	టీడీపీ
184	66	షేక్ జాస్మిన్	వైయస్సార్సీపీ
185	66	షేక్ మైమున్	ఇండిపెండెంట్
186	66	షేక్ నూరి	ఐఎన్‌సి
187	67	అరవ లక్ష్మి	వైయస్సార్సీపీ
188	67	నిమ్మల ప్రసన్నకుమారి	టీడీపీ
189	68	అరవ ప్రమీల	వైయస్సార్సీపీ
190	68	కట్టుమూరి శైలజ	టీడీపీ
191	68	కాయల మేరీ	ఇండిపెండెంట్
192	68	మిదూరి శిరీష	ఇండిపెండెంట్
193	69	మేకల నరసింహారావు	ఇండిపెండెంట్
194	69	మేకల శ్రీనివాసులు	ఇండిపెండెంట్
195	69	ముంగర మల్లికార్జున	ఇండిపెండెంట్
196	69	షేక్ అబ్దుల్ అజీజ్	ఇండిపెండెంట్
197	69	షేక్ అజాజ్	ఐఎన్‌సి
198	69	షేక్ జరీనా	ఇండిపెండెంట్
199	69	షేక్ మహబూబ్ బాషా	వైయస్సార్సీపీ
200	69	షేక్ షాహినా	టీడీపీ
201	70	బాగి వెంకట రమణయ్య	వైయస్సార్సీపీ
202	70	కత్తి శ్రీనివాసులు	సీపీఐ(ఎం)
203	70	చంచల ప్రసాద్	ఇండిపెండెంట్
204	70	కొల్లి రామతులసమ్మ	ఐఎన్‌సి
205	70	రాచగిరి చంద్రశేఖర్	టీడీపీ
206	71	నరసాపురం రమాదేవి	ఐఎన్‌సి
207	71	షేక్ అలియా	జనసేన
208	71	షేక్ అన్వర్ జన్	ఇండిపెండెంట్
209	71	షేక్ మున్వర్ జన్	ఇండిపెండెంట్
210	71	షేక్ రుహీనా	వైయస్సార్సీపీ
211	71	షేక్ షహనాజ్	సీపీఐ
212	71	షేక్ షకీలా	సీపీఐ(ఎం)
213	72	గజ్జె పరమేశ్వరి	సీపీఐ(ఎం)
214	72	షేక్ ఆసియా	వైయస్సార్సీపీ
215	72	షేక్ ఆయేషా	ఇండిపెండెంట్
216	72	షేక్ సల్మా	టీడీపీ
217	72	షేక్ షహనాజ్	సీపీఐ

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

లాయర్

సంపుటి : 46 సంచిక : 22 30.10.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

అలవికాని చోట అధికులమనరాదు

- వైసీపీ నాయకుల సరికొత్త వ్యూహం
- కావాలనే తప్పులు తడకలతో నామినేషన్‌లు
- ఆ తర్వాత తిరస్కరించబడ్డాయంటూ గగ్గోలు

"వ్రతం చెడినా ఫలితం దక్కాలి" ఇది పెద్దలు చెప్పిన మాట. అదే తరుణంలో "అలవికాని చోట అధికులమనరాదు" ఇదీ పెద్దల మాటే. ఈ రెండు మాటలని స్థానిక ఎన్నికలలో సరిగ్గా వినియోగించుకున్నారు ఆంధ్రాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు. ఎన్నికలలో పోటీ చేయనంటే అధిష్టానం ఒప్పుకోదు, వారి మాట విని బలవంతంగా పోటీకి దిగితే అధికార పార్టీ బలం ముందు తట్టుకోవడం కష్టమే. అంతేకాకుండా చేతిలో ఉన్న కొద్ది చమురు కూడా వదిలిపోతుంది. ఇదే ఆలోచనతో సరికొత్త వ్యూహంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ముందుకెళ్ళినట్లు రాష్ట్రమంతా గుసగుసలు గుప్పుమంటున్నాయి. జగనన్నను ప్రసన్నం చేసుకోవడం కోసం నామి నేషన్లకు మేం సై అన్నట్లుగా ఓ వైపు కలరింగ్ ఇస్తూనే, మరోవైపు తప్పుల తడకలతో నామినేషన్లని దాఖలు చేసి అవి తిరస్కరణకు గురయ్యేలా తమ వాళ్ళు గొప్ప పథకం వేశారనే అభిప్రాయాలు ఆ పార్టీ శ్రేణుల నుండే వ్యక్తమవుతున్నాయి.

13లో

త్యాగానికి దక్కిన ఫలితం

పోలంరెడ్డికి

జడ్పీ ఛైర్మన్ పీఠం

5లో

అదృష్టం మరోసారి శీనయ్య ఇంటి తలుపు తట్టింది

జిల్లాలో బీటలు వారిన వైసిపి కంచుకోట

జడ్పీ ఛైర్మెన్ పదవికి కూడా పోటీ పెట్టలేని దీనస్థితిలో జగన్ పార్టీ

ఒకప్పుడు నెల్లూరుజిల్లాలో రాజకీయ ప్రత్యర్థులకు కొరకరాని కొయ్యగా మారిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి నేడు రాజకీయ ఉనికిని చాటుకోవడమే సవాలుగా మారిందంటే అతిశయోక్తి కాదేమో. ఏళ్ళ తరబడి చేసిన కృషితో, పోరాటాలతో జిల్లాలో క్రమంగా పట్టు పెంచుకుంటూ, 2019లో తిరుగులేని విజయాలతో రాజకీయ కంచుకోటను నిర్మించు కున్న పార్టీ జగన్ పార్టీ. అలాంటి పార్టీకి స్థానిక ఎన్నికలలో జిల్లా పరిషత్ ఛైర్మెన్ పదవికి అభ్యర్థిని సైతం నిలబెట్టలేని పరిస్థితి వచ్చిందంటే అది కేవలం ఒక్క ఎన్నికకు సంబంధించిన పరిణామంగా మాత్రమే చూడలేం. ఒకప్పుడు బలంగా ఉన్న రాజకీయ వ్యవస్థలో ఏర్పడిన అంతర్గత బలహీనతలకు అద్దం పట్టే అంశంగా దాన్ని పరిగణించాలి. నెల్లూరు జిల్లా రాజకీయ చరిత్రలో వైసీపీ ప్రస్థానం ఒకప్పుడు విజయాల పరంపర. నేడు అదే పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లు రాజకీయంగా ఆసక్తికరమైన మలుపు.

4లో

కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మ గారు

నిర్యాణం: 01-11-2013

13వ వర్ధంతి

అనురాగమూర్తి... ఆత్మీయదీప్తి...

అమ్మ

ఆమె ప్రేమానురాగాలే మాకు స్ఫూర్తి

ఆమె నడిపించిన బాటే మాకు కీర్తి

కుమారుడు

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు లోక్‌సభ సభ్యులు

క్యాన్సర్ ఆసుపత్రికి..

7 లక్షల విరాళం

- రైసుమిల్లు యజమాని రుద్రపాటి దాతృత్వం -

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహిస్తున్న క్యాన్సర్ ఆసుపత్రిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు దాత రుద్రపాటి వెంకటేశ్వర్లు నాయుడు ఈనెల 29న 7 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. గురువారం నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లకు ఆ విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధి పనులకి ఈ విరాళాన్ని వినియోగించి, తమ కుటుంబ సభ్యుల పేర్లతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని దాత ఈ సందర్భంగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి మంచి మనసుతో రూ.7 లక్షల విరాళం అందించిన నరుకూరు సమీపంలోని రైస్ మిల్ యజమాని రుద్రపాటి వెంకటేశ్వర్లు నాయుడును కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, రెడ్ క్రాస్ సభ్యులు యాలమూరి రంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే అభివృద్ధి

• మేయర్ అభ్యర్థి ఆనం విజయ

వైసీపీ హయాంలోనే నెల్లూరు నగరాభివృద్ధి జరిగిందని, ఆ అభివృద్ధిని చూసి ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని నెల్లూరు నగర మేయర్‌గా పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 28న ఆయన 56వ డివిజన్‌లో కార్పొరేటర్ అభ్యర్థి కుంచాల కృష్ణవేణితో కలిసి, స్థానిక పరమేశ్వరినగర్, మనుమసిద్ధినగర్, శివగిరికాలనీ, ఇరుగోళమ్మ సంగం, రాజీవ్ గృహకల్ప, మహేశ్వరినగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారం.. ధనం, దౌర్జన్యాలతో ఎన్నికలలో గెలిచేందుకు అధికారపార్టీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. అవినీతి, అక్రమాలు, దోపిడీలు, అరాచకత్వాలకు తావులేకుండా ప్రజలు ఓటుతోనే వారికి తగు సమాధానం చెప్పాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి ప్రజలకు అండగా ఉండే వైఎస్సార్సీపీ అభ్యర్థులను ఈ ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు.

ముమ్మరంగా ప్రచారం :

ఈ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీలో ఉన్న ఆనం విజయకుమార్‌రెడ్డికి మద్దతుగా పార్టీనాయకులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు నగరంలోని అనేక డివిజన్లలో ఈనెల 28న ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అన్యాయాలు చేస్తోందని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం లేదని వారు విమర్శించారు. ప్రజలు ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించుకుంటే నెల్లూరు నగరాభివృద్ధికి బాటలు వేసినట్లవుతుందని వారు కోరారు.

రోడ్‌షోలో మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

జిల్లాలో బీటలు వారిన వైసిపి కంచుకోట

(మొదటిపేజీ తరువాయి)

అధికారం ఉన్నప్పుడు కనిపించిన బలం, అధికారం పోయిన తర్వాత కూడా నిలబడుతుందా? ప్రజాప్రతినిధుల సంఖ్యతో నిర్మించుకున్న ఆధిపత్యం, ప్రజల్లో నిలబెట్టుకున్న విశ్వాసంగా మారిందా? లేక అధికారమే పార్టీ బలానికి ప్రధాన ఆధారంగా నిలిచిందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన సమయం వైసీపీకి ఆసన్నమైందని స్పష్టంగా చెప్పొచ్చు.

విజయాల శిఖరం నుంచి అధఃపాతాళానికి!

2019 ఎన్నికలు వైసీపీకి నెల్లూరుజిల్లాలో అసాధారణ విజయాన్ని అందించాయి. లోక్‌సభ స్థానంతో పాటు జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలనూ గెలుచుకుని ప్రత్యర్థులకు గట్టి రాజకీయ సందేశం ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లోనే కాకుండా, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. నెల్లూరు నగర కార్పొరేషన్‌లో 54 డివిజన్లనూ కైవసం చేసుకోవడం, జిల్లా పరిషత్ పీఠాన్ని దక్కించుకోవడం ఆ పార్టీ రాజకీయ బలానికి నిదర్శనాలుగా నిలిచాయి. అప్పట్లో జిల్లాలో వైసీపీకి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగడం ప్రత్యర్థులకు కష్టసాధ్యంగా కనిపించింది. గ్రామస్థాయి నుంచి నగర రాజకీయాల వరకు ఆ పార్టీ ప్రాభవం స్పష్టంగా కనిపించింది. అధికార పార్టీగా ఉన్న బలం, నాయకుల పనితీరు ప్రభావం, కార్యకర్తల చురుకుదనం కలిసి వైసీపీకి తిరుగులేని ఆధిపత్యాన్ని అందించాయి. కానీ రాజకీయాల్లో విజయాలు ఎంత వేగంగా వస్తాయో, పరిస్థితులు మారితే అంతే వేగంగా సవాళ్లు కూడా ఎదురవుతాయి. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో వైసీపీ రాజకీయ ప్రయాణంలో కీలకమైన మలుపు ఏర్పడింది. అధికారంలో ఉన్నప్పుడు కనిపించిన రాజకీయ ఐక్యత, అధికారానికి దూరమైన తర్వాత కూడా అదే స్థాయిలో కొనసాగుతుందా అన్నది ప్రశ్నార్థకమే.

కంచుకోటకి బీటలు..... కారణం ఓటమి మాత్రమేనా?

ఒక పార్టీ బలహీనపడటానికి ఎన్నికల్లో ఓటమి ఒక్కటే కారణం కాదు. ఓటమి తర్వాత ఆ పార్టీ ఎలా స్పందిస్తుంది? నాయకత్వం ఎంత సమర్థంగా వ్యవహరిస్తుంది? కార్యకర్తల్లో ఎంత విశ్వాసాన్ని నిలబెడుతుంది? ప్రజా సమస్యలపై ఎంత నిరంతరంగా పోరాడుతుంది? అన్న అంశాలే దాని భవిష్యత్తును నిర్ణయిస్తాయి. నెల్లూరులో వైసీపీ ఎదుర్కొంటున్న పరిస్థితిని ఈ కోణంలో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ చుట్టూ సమీకృతమైన రాజకీయ బలం, అధికార మార్పు తర్వాత ఎంతవరకు నిలిచింది? స్థానిక నాయకుల మధ్య సమన్వయం కొనసాగుతోందా? క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు నాయకత్వం నుంచి తగిన భరోసా లభిస్తోందా? గత విజయాలకు కారణమైన రాజకీయ సమీకరణలను తిరిగి నిర్మించగలుగుతున్నారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకప్పుడు ఎన్నికల బరిలో ప్రత్యర్థులకు సవాల్ విసిరిన పార్టీ, నేడు కీలకమైన జిల్లాపరిషత్ ఛైర్మన్ పదవికి అభ్యర్థిని నిలబెట్టలేక పోయిందంటే, అది రాజకీయంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిణామం. అయితే ఈ పరిస్థితికి నాయకత్వ వైఫల్యమే ఏకైక కారణమా లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా ఆపార్టీ శ్రేణులే విశ్లేషించుకోవాలి.

జడ్పీ ఛైర్మన్ పదవికి అభ్యర్థే లేకపోవడం రాజకీయంగా చిన్న విషయం కాదు!

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి అన్నది కేవలం ఒక రాజకీయ హోదా కాదు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీకి ఉన్న పట్టుకు, స్థానిక ప్రజాప్రతినిధులతో ఉన్న సంబంధాలకు, నాయకత్వం సమన్వయ సామర్థ్యానికి అది ఒక ముఖ్యమైన సూచిక. అలాంటి పదవికి పోటీచేసే అభ్యర్థిని నిలబెట్టలేని పరిస్థితి ఏర్పడితే, అది పార్టీ క్షేత్రస్థాయి బలంపై సహజంగానే అనేక సందేహాలను లేవనెత్తుతుంది. ప్రత్యర్థులతో పోరాడటానికి సిద్ధంగా ఉండాల్సిన సమయంలోనే పార్టీ పోటీకి దూరంగా ఉంటే, దాని వెనుక ఉన్న కారణాలను విశ్లేషించాల్సి ఉంటుంది. తమకి కావలసినంత సంఖ్యా బలం పొందలేమన్న భయమా? బలమైన అభ్యర్థి అందుబాటులో లేకపోవడమా? నాయకుల మధ్య సమన్వయ లోపమా? లేక ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పోరాటానికి అవసరమైన వ్యూహాన్ని రూపొందించడంలో వైఫల్యమా? ఈ ప్రశ్నలకు పార్టీ నాయకత్వమే సమాధానం చెప్పాలి. ఇక్కడ గమనించాల్సిన మరోముఖ్య అంశం కూడా వుంది. గతంలో భారీ విజయాలు సాధించిన పార్టీ ప్రస్తుత దీనస్థితిలో ఉందన్న విషయం స్పష్టంగా కనిపిస్తుంది. ఎందుకంటే వైసీపీకి నెల్లూరు జిల్లా రాజకీయంగా కొత్త ప్రాంతం కాదు. ఇక్కడ పార్టీకి గత ఎన్నికల అనుభవం ఉంది, మంత్రులుగా, ఛైర్మన్లుగా, మేయర్లుగానే కాకుండా ఇంకా వివిధ హోదాలలో పనిచేసిన నాయకులు చాలా మందే ఉన్నారు, క్షేత్రస్థాయిలో రాజకీయ కార్యకలాపాలు నిర్వహించిన కార్యకర్తల వ్యవస్థ ఉంది. ఇన్ని వనరులు ఉన్నప్పటికీ పోటీకి అవసరమైన బలాన్ని ఎందుకు సమీకరించుకోలేకపోయారో అన్న అంశంపై వైసీపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

క్యాడర్‌కి భరోసా కల్పించాలి!

రాజకీయ పార్టీలకు నాయకులే ముఖచిత్రం కావచ్చు. కానీ పార్టీని క్షేత్రస్థాయిలో నిలబెట్టేది కార్యకర్తలే. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన శ్రేణులు, అధికార మార్పు తర్వాత కూడా అదే ఉత్సాహంతో పనిచేయాలంటే నాయకత్వం వారికి అండగా నిలవాలి. ప్రజా సమస్యలపై పోరాటాలు, స్థానిక స్థాయిలో నిరంతర కార్యక్రమాలు, కార్యకర్తలతో ప్రత్యక్ష సంబంధాలు పార్టీని సజీవంగా ఉంచుతాయి. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రతిపక్షంలో ఉండటం ఒక రాజకీయ సవాలు. కానీ ప్రతిపక్షంలో ఉన్నామనే కారణంతో రాజకీయంగా నిష్క్రియంగా మారిపోవడం మరింత పెద్ద ప్రమాదం. పార్టీ కార్యాలయాలు, నాయకుల ప్రకటనలు, గత విజయాల ప్రస్తావనలతో మాత్రమే రాజకీయ బలం నిలబడదు. ప్రజల మధ్య ఉండటం, వారి సమస్యలపై పోరాడటం, స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండటం ద్వారానే ఆ బలాన్ని నిరూపించుకోవాలి. నెల్లూరులో వైసీపీ నాయకత్వం ఇప్పుడు తన కేడర్‌కు కొత్త భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉంది. గతంలో సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడం కంటే, భవిష్యత్తులో సాధించబోయే విజయాలకు పునాది వేయడం ముఖ్యం. నాయకుల మధ్య విభేదాలు ఉంటే వాటిని పరిష్కరించడం, స్థానికంగా ప్రభావం కోల్పోయిన ప్రాంతాల్లో పార్టీని పునర్నిర్మించడం, ప్రజలతో సంబంధాలను బలోపేతం చేయడం వంటి చర్యలు లేకపోతే రాజకీయ పునరుజ్జీవనం కష్టసాధ్యమే.

నాటి 54కి 54 సీట్లకి... నేటి పరిస్థితికి మధ్య ఎంత వ్యత్యాసం!

నెల్లూరు కార్పొరేషన్‌లో గతంలో 54 డివిజన్లలోనూ విజయం సాధించిన పార్టీకి, నేడు స్థానిక రాజకీయాల్లో ఎదురవుతున్న సవాళ్లు గతానికీ వర్తమానానికీ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తుచేస్తున్నాయి. అప్పట్లో ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వని స్థాయిలో ఆధిపత్యం ప్రదర్శించిన పార్టీ, ఇప్పుడు తన బలాన్ని తిరిగి నిరూపించుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. అయితే గతంలో సాధించిన విజయం శాశ్వత రాజకీయ ఆధిపత్యానికి హామీ కాదు. స్థానిక సంస్థల్లో ప్రజల తీర్పు, నాయకుల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. అందువల్ల అప్పటి 54 స్థానాల విజయాన్ని మాత్రమే ప్రస్తుత రాజకీయ బలానికి కొలమానంగా తీసుకోలేం. గతంలో పార్టీకి మద్దతుగా నిలిచిన ఓటర్లు ఇప్పుడు ఏ వైఖరితో ఉన్నారు? స్థానిక నాయకులపై వారి అభిప్రాయం ఏమిటి? పార్టీ ప్రతిపక్ష పాత్రను సమర్థంగా పోషిస్తోందని వారు భావిస్తున్నారా? అన్న అంశాలే వైసీపీ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. గత విజయాల గణాంకాలు రాజకీయ చరిత్రలో నిలిచిపోతాయి. కానీ కొత్త విజయాలు సాధించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాల్సిందే.

రాజకీయ ప్రత్యర్థులకు అవకాశం.. వైసీపీకి హెచ్చరిక!

ఒకప్పుడు జిల్లాలో వైసీపీ ఆధిపత్యాన్ని సవాల్ చేయడానికి ఇబ్బందిపడిన ప్రత్యర్థి పార్టీలు, ఇప్పుడు మారిన రాజకీయ పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీకి పరిపాలనా బాధ్యతలతో పాటు స్థానిక స్థాయిలో రాజకీయంగా బలపడే అవకాశం ఉంటుంది. వైసీపీ మాత్రం తన గత బలాన్ని తిరిగి సమీకరించుకోవాల్సిన సవాలును ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితి ప్రత్యర్థులకు రాజకీయంగా అవకాశాన్ని కల్పించినప్పటికీ, వైసీపీకి ఇది పూర్తిగా తలుపులు మూసుకుపోయిన దశ అని కూడా చెప్పలేం. గతంలో బలమైన పునాది నిర్మించుకున్న పార్టీలు సరైన వ్యూహం, నాయకత్వ సమన్వయం, క్షేత్రస్థాయి పోరాటాలతో తిరిగి పుంజుకున్న సందర్భాలు ఉన్నాయి. కానీ అందుకు గత విజయాల జ్ఞాపకాల్లో ఉండటం కాకుండా, ప్రస్తుత బలహీనతలను గుర్తించి వాటిని సరిదిద్దుకోవడం చాలా అవసరం.

కంచుకోటను కాపాడుకోవడం కంటే.. పునర్నిర్మించుకోవడమే అసలు సవాలు!

నెల్లూరు జిల్లాలో వైసీపీ ప్రస్థానం ఇప్పుడు ఒక కీలకమైన రాజకీయ మలుపు వద్ద నిలబడుందని స్పష్టంగా చెప్పొచ్చు. 2019లో పది అసెంబ్లీ స్థానాల విజయంతో శిఖరాన్ని అధిరోహించిన పార్టీ, నగర కార్పొరేషన్‌లో 54కి 54 డివిజన్లను గెలుచుకున్న పార్టీ, జిల్లా పరిషత్ పీఠాన్ని దక్కించుకున్న పార్టీ.. నేడు తన రాజకీయ బలాన్ని తిరిగి నిరూపించుకోవాల్సిన దీన పరిస్థితిని ఎదుర్కొంటోంది. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి అభ్యర్థిని నిలబెట్టలేని పరిస్థితి వైసీపీకి ఏర్పడిందంటే, అది వైసీపీకి సాధారణ రాజకీయ ఎదురుదెబ్బ కాదు. గత ఆధిపత్యాన్ని నిలబెట్టుకోలేకపోవడంపై పార్టీ నాయకత్వం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన హెచ్చరిక. అసలు పరీక్ష రాబోయే ఎన్నికల్లోనూ, ప్రజల మధ్య పార్టీ కొనసాగించే రాజకీయ పోరాటంలోనూ ఉంటుంది. రాజకీయ కంచుకోటలు గెలుపులతో నిర్మితమవుతాయి, కానీ వాటిని నిలబెట్టేది ప్రజల విశ్వాసం, నాయకత్వ సామర్థ్యం, కార్యకర్తల ఐక్యత. ఈ మూడు అంశాల్లో బలహీనత ఏర్పడితే, గతంలో ఎంతటి ఘన విజయాలు సాధించినా ఆ ఆధిపత్యం నిలవదు. నెల్లూరులో వైసీపీ ఇప్పుడు ఎదుర్కొంటున్న అసలు సవాలు ఇదే. బీటలు వారిన కంచుకోటను తిరిగి పటిష్ఠం చేసుకుంటుందా? లేక గత విజయాలే రాజకీయ జ్ఞాపకాలుగా మిగిలిపోతాయా? అన్నది ఆ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలు, క్షేత్ర స్థాయిలో చూపించే కార్యాచరణపై ఆధారపడి ఉంటుంది!

చక్రం తిప్పిన ప్రశాంతమ్మ

• ఏకగ్రీవమైన 5 జడ్పీటీసీల్లో.. 3 కోవూరు నియోజకవర్గంలోవే!

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన రాజకీయ సత్తాఏమిటో నిరూపించుకున్నారు. జడ్పీ రాజకీయాల్లో తనదైన ముద్రతో రాణిస్తున్న ఆమె ఈ ఎన్నికల్లో తమ రాజకీయ చతురతతో అందరినీ ఆశ్చర్యపరిచారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 36 జడ్పీటీసీ స్థానాల్లో 5 ఏకగ్రీవమైతే, అందులో 3 స్థానాలు ఒక్క కోవూరు నియోజకవర్గంలోవే కావడం విశేషం. ఆ మొత్తం 5 స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. ఏకగ్రీవం అయిన ఆ 5 జడ్పీటీసీ స్థానాల్లో మూడు కోవూరు నియోజకవర్గంలోని మండలాలు కావడం జిల్లాలో సంచలనం కలిగించింది. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ప్రాతినిధ్యం వహిస్తున్న కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, ఇందుకూరుపేట జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్లకు గడువు పూర్తయిన నేపథ్యంలో చివరి నిముషంలో ఈ మూడు స్థానాల్లో పోటీ చేసిన వైసీపీ అభ్యర్థులు వారి వారి నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇతర పార్టీలు, స్వతంత్రులు కూడా నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఏకగ్రీవానికి మార్గం సుగమమైంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నామినేషన్ల ఉపసంహరణ వెనుక కీలకపాత్ర పోషించి ఉంటారన్నది బహిరంగ రహస్యమే.

అదేవిధంగా, గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిల్లకూరు జడ్పీటీసీ, ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని సీతారాంపురం జడ్పీటీసీ స్థానం కూడా ఏకగ్రీవం అయింది. అక్కడ కూడా టీడీపీ అభ్యర్థులే ఏకగ్రీవమయ్యారు. మొత్తానికి 35 జడ్పీటీసీ స్థానాలకు గానూ 5 స్థానాలు తెలుగుదేశం పార్టీ ఏకగ్రీవంగా దక్కించుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

'గునుకుల'ను గెలిపించుకుందాం

• మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి పిలుపు

విజయలక్ష్మి గెలుపు కోసం ప్రచారం చేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నవంబరు 1వ తేదీన జరుగనున్న నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 21వ డివిజన్‌లో కూటమి తరపున బలపరచిన, జనసేన పార్టీ అభ్యర్థిని గునుకుల విజయలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని రాష్ట్ర పురపాలక మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఈనెల 27వతేదీ రాత్రి వారు 21వ డివిజన్ పరిధిలోని రాంజీనగర్, స్వామిదాస్ స్కూల్ రోడ్డు, చిల్డ్రన్స్‌పార్కు రోడ్డు, జగదీష్‌రెడ్డినగర్‌లలో రోడ్‌షోను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను వమ్ము చేయకుండా, అన్ని వాగ్దానాలను అమలుచేస్తోందన్నారు. అధికంగా నిధులు రాబట్టి నెల్లూరు నగరాభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. ఇప్పటివరకు కోట్లాదిరూపాయల వ్యయంతో నెల్లూరును ఎంతో అభివృద్ధి చేశామని, ప్రజలు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని వారు అభ్యర్థించారు. నెల్లూరు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే ఈ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిగా పోటీచేస్తున్న పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్‌ను, కూటమి అభ్యర్థులను, కూటమి బలపరుస్తున్న జనసేన అభ్యర్థులను గెలిపించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు గునుకుల కిషోర్, టీడీపీ నాయకులు ముంగమూరు యశ్వంత్, మధు, కేవీరెడ్డి, చల్లా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీల పోలింగ్..తేదీల మార్పు

నవంబరు 5న పోలింగ్, 7న కౌంటింగ్

జడ్పీటీసీ, ఎంపీటీసీల పోలింగ్ తేదీలను, ఓట్ల లెక్కింపు తేదీలని మార్పు చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈనెల 28న ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ప్రకటించినట్లు నవంబరు 3న పోలింగ్, 5న ఓట్ల కౌంటింగ్‌లకు బదులు, నవంబరు 5న పోలింగ్, 7న కౌంటింగ్ నిర్వహించనున్నారు. మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ 3వ తేదీ ఉండడంతో, జడ్పీటీసీ - ఎంపీటీసీల ఎన్నికలకు సంబంధించి ఆమేరకు ఎన్నికల కమిషన్ మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

తిరుపతి జడ్పీ పీఠం..

'పనబాక' వారసురాలికేనా?

❍ జిల్లావ్యాప్తంగా ఆసక్తికరమైన చర్చ!

డాక్టర్ చేతన

తిరుపతి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పీఠం మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి - పనబాక కృష్ణయ్యల కుమార్తె డాక్టర్ పనబాక చేతనకి దక్కుతుందా?.. ఈ ఎన్నికల్లో ఆమెని అదృష్టం వరించి, జడ్పీ ఛైర్‌పర్సన్ అవుతుందా?..అన్న ప్రశ్నలకు తిరుపతిజిల్లాలోని అధికశాతం మంది ఔననే అంటున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచేవారిలో డాక్టర్ చేతన పేరే ప్రముఖంగా వినిపిస్తోంది కూడా. 'పనబాక' వారంటేనే మంచి విద్యావంతుల కుటుంబంగా పేరు. రాజకీయాల్లోనూ ఆ కుటుంబానికి తొలినుంచీ మంచి పట్టుంది. గతంలో పార్లమెంట్ సభ్యురాలిగా, కేంద్రమంత్రిగా పనబాక లక్ష్మి ఎంతోకాలం సేవలందించారు. ఇప్పటికీ తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షురాలిగా కూడా ఆమె నిర్విరామంగా పని చేస్తూ, తన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతేకాదు, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలిగా అటు భగవంతునిసేవ, ఇటు భక్తుల సేవలో తరిస్తున్నారు. మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న పనబాక కుటుంబం నుంచి ఇప్పుడు వారి కుమార్తె డాక్టర్ చేతన జిల్లా రాజకీయరంగంలో దూసుకుపోతుండడంతో జిల్లా అంతటా ఆమె పేరు మారుమ్రోగిపోతోంది. శ్రీకాళహస్తి రూరల్ జడ్పీటీసీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికై, ఇప్పుడు జడ్పీ ఛైర్‌పర్సన్ రేసులో డాక్టర్ చేతన ముందంజలో ఉండడం విశేషం. అటు విద్యావంతురాలిగా, ప్రజలకు సేవచేసే వైద్యురాలిగా, యువ నాయకురాలిగా కూడా అందరి మన్ననలు అందుకుంటున్న డాక్టర్ చేతన జడ్పీ ఛైర్‌పర్సన్‌గా విజయం సాధిస్తారనే ధీమా అందరిలో వ్యక్తమవుతోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధిని సాధిస్తుండడం, రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యం కల్పించడం, విద్యావంతులను ప్రజాప్రతినిధులుగా ప్రోత్సహిస్తుండడంతో పాటు, ముఖ్యంగా రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్నవారికి అవకాశాలు కల్పించడం వంటి అంశాలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉంటున్నాయి. యువనేత నారా లోకేష్ రాజకీయ కార్యాచరణ, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా ఆయన అనుసరిస్తున్న విధానాలను గమనిస్తే, యువనాయకురాలిగా ఎదుగుతున్న డాక్టర్ పనబాక చేతనకు జడ్పీ పీఠం దక్కే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయంటున్నారు. తిరుపతి జిల్లా ప్రజల ఆకాంక్ష కూడా ఇదేనని రాజకీయవర్గాలు కూడా అంచనా వేస్తున్నాయి. ఏదేమైనా, ఎంతో ప్రతిష్ఠాత్మకమైన తిరుపతి జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి సంబంధించి పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అందరూ ఎదురుచూస్తున్నారు!..చివరికి..ఆ ఏడుకొండలవాడి ఆశీస్సులు, పార్టీ దీవెనలు ఎవరిపై ఉంటాయో..తిరుపతి జడ్పీ పీఠం ఎవరికి దక్కుతుందో వేచిచూడాల్సిందే మరి!...

• త్యాగానికి దక్కిన ఫలితం

పోలంరెడ్డికి జడ్పీ ఛైర్మన్ పీఠం

➤ అదృష్టం మరోసారి శీనయ్య ఇంటి తలుపు తట్టింది

నెల్లూరుజిల్లా రాజకీయ తెరపై 2004లో అనూహ్యంగా ప్రత్యక్షమై అతి తక్కువ మెజారిటీతో కోవూరు శాసనసభ్యుడిగా ఎన్నికైన అదృష్ట జాతకుడు పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి. ఆ తరువాత 2009 ఎన్నికలలో ఓడిపోయినా, ఎక్కడా నిరుత్సాహపడకుండా నిత్యం ప్రజాక్షేత్రంలో వుంటూ మళ్ళీ 2014లో కోవూరు ఓటర్ల మనసులు దోచుకుని మరోసారి శాసనసభకి వెళ్ళిన ఘనత కూడా శీనయ్యదే. ఆ తరువాత 2019లో జిల్లాలో వైసీపీ గాలిలో కొట్టుకుపోయినవాళ్ళలో పోలంరెడ్డి ఒకరు. అక్కడా ఆయన తగ్గలేదు, ఓ వైపు అధికారపార్టీపై పోరాటాలు సాగిస్తూనే, మరోవైపు తమ కుమారుడు దినేష్‌ని తన రాజకీయ వారసుడిగా కోవూరు జనానికి పరిచయం చేశారు. అయితే, 2024లో జిల్లాలో జరిగిన అనేక రాజకీయ సమీకరణలతో కోవూరు నియోజకవర్గాన్ని పోలంరెడ్డి త్యాగం చేయవలసి వచ్చింది. కోవూరు సీటు పోలంరెడ్డి చేతులనుండి వేమిరెడ్డి దంపతుల చేతికి వెళ్ళిపోయింది. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు శాసనసభ్యురాలిగా ఊహించని మెజారిటీతో విజయం సాధించింది. అయినా పోలంరెడ్డి ఎక్కడా అసంతృప్తిని వ్యక్తం చేయలేదు. ఇదే తరుణంలో ఇటు నియోజకవర్గాన్ని అటు పార్టీని కూడా విడిచిపెట్టలేదు. ఆ త్యాగమే ఇప్పుడు ఆయనకి కలిసొచ్చింది. అదృష్టం మరోసారి ఆయన ఇంటి తలుపు తట్టింది. క్యాబినెట్ హోదా కలిగిన జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి ఇప్పుడు ఆయనని వరించబోతోంది.

పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఇందుకూరుపేట జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారవర్గాలు ప్రకటించడంతో జిల్లా రాజకీయాల్లో ఆయన పేరు మరోసారి సంచలనాత్మకమయ్యింది. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని లక్ష్యంగా చేసుకుని తెలుగుదేశం పార్టీ ఆయనను బరిలోకి దింపితే, జడ్పీటీసీగా ఆయన ఏకగ్రీవం కావడంతో ఆ దిశగా తొలి విజయం ఆయనని వరించింది. ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం, పార్టీ రాజకీయాల్లో పరిచయాలు, నాయకత్వ సామర్థ్యం.. ఇవన్నీ పోలంరెడ్డికి వున్న సానుకూల అంశాలు. పోలంరెడ్డి శీనయ్య రాజకీయ ప్రస్థానంలో కోవూరు నియోజకవర్గం కీలకపాత్ర పోషించింది. 2004లో కాంగ్రెస్‌పార్టీ తరపున, 2014లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కోవూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై రెండు పర్యాయాలు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం, రాజకీయ ప్రత్యర్థుల వ్యూహాలపై అవగాహన, పార్టీ శ్రేణులతో సంబంధాలు ఆయనకు ఉన్న ప్రధాన బలాలు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ, రాజకీయాల్లో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఇప్పుడు జిల్లా స్థాయి పదవిపై అయన దృష్టి సారించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సంపాదించిన రాజకీయ పరిచయాలను స్థానిక సంస్థల రాజకీయాల్లో ఉపయోగించుకోవడం ఇప్పుడు ఆయనకు కలిసొచ్చిన అంశం.

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి కేవలం ఒక హోదా మాత్రమే కాదు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల సమన్వయం, వివిధ మండలాల అవసరాలపై దృష్టి సారించాల్సిన బాధ్యత కూడా దీనితో ముడిపడి ఉంటుంది. ఈ బాధ్యతలను సమర్థంగా నిర్వహించగల నాయకుడిగా తనను తాను నిరూపించుకునేందుకు పోలంరెడ్డికి అవకాశం లభించనుంది. పోలంరెడ్డి స్వతహాగా సౌమ్యుడు, మిత భాషి. అందరిని కలుపుకుపోగలిగిన స్వభావం ఆయన సొంతం. ముఖ్యంగా అదృష్టదేవత తరచూ అయన ఇంటి తలుపు తడుతూనే ఉంటుంది. రాజకీయంగా ఆయనకి ఊహించని అవకాశాలు కల్పిస్తూనే ఉంటుంది. 2024లో తనకి లేదా తన కుమారుడు దినేష్‌రెడ్డికి పోటీచేసే అవకాశం రాకపోవడం పట్ల ఆయన ఎక్కడా కుంగిపోలేదు. పార్టీని వీడిపోలేదు. పదవులపై ఆశలు వదులుకోలేదు. అవకాశం కోసం ఎదురు చూశారు. ఇన్నాళ్ళకి అవకాశం వచ్చింది. ఆయన నిరీక్షణ ఫలించింది. ఆయన చేసిన త్యాగానికి ఫలితం దక్కింది. జిల్లా పరిషత్ అధ్యక్ష పదవి వెతుక్కుంటూ వచ్చి ఆయనని వరించింది. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా సత్తా, సమర్థత, సమయస్ఫూర్తి ఉన్న వ్యక్తికి అవకాశం లభించింది.

ఆల్ ది బెస్ట్ టు పోలంరెడ్డి..!

లాయర్
అక్టోబరు 30, 2026

నగరాలు సుందరమే కానీ.. సమస్యలే కోకొల్లలు!

పెద్ద పెద్ద భవంతులు, విశాలమైన రోడ్లు, వాటిమీద ఎడతెరిపిలేకుండా వెళ్లే రకరకాల వాహనాలు, జిగేల్‌మనిపించే విద్యుద్దీపాల కాంతులు.. నగరాలు నిజంగానే సుందరవనాలుగానే కనిపిస్తాయి. స్టార్‌హోటళ్ళు, పబ్‌లు, లెక్కలేనన్ని షాపింగ్‌మాల్స్. ఎక్కడ చూసినా అంతస్తులకి పై అంతస్తులుగా ఆకాశమంత ఎత్తున జరిగే నిర్మాణాలు, ఆకట్టుకునే దుకాణాల వరుసలు వంటివన్నీ ప్రజలకి కనువిందు చేస్తూనే ఉంటాయి. కానీ వాటన్నిటివెనకాల చెప్పలేనన్ని సమస్యలు కూడా ఉన్నాయి. ఇటీవలి కాలంలో నగరాల్లో పరిశ్రమలు పెద్దసంఖ్యలో వస్తుండడంతో పారిశ్రామికంగా అభివృద్ధి బాగా పెరుగుతున్న విషయం వాస్తవమే అయినా, నగర ప్రజల జీవితాలు మాత్రం ఆశించిన స్థాయిలో వృద్ధి చెందడం లేదని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పల్లెప్రాంతాల్లో వ్యవసాయ రంగం బాగా క్షీణించిపోతుండడంతో, ఉన్న పొలంపుట్రా నంతా అమ్మేసి అనేకమంది ప్రజలు నగరాలకి, పట్టణాలకి వలసలు వచ్చేస్తూనే ఉన్నారు. అసలే నగరాల్లో ఉన్న జనాభాతో పాటు, ఈ సంఖ్య కూడా చేరి నగరాలు జనావాసాలకి చాలనంతగా తయారవుతున్నాయి. ఆ జనాభాకంతటికీ అవసరమైన మంచినీరు, ఇళ్ళ స్థలాలు, ఇతరత్రా మౌలిక సదుపాయాల కల్పన నగరపాలకులకి ఒక పెనుసవాలుగా ఉంటోంది. మనదేశంలో ఉన్న అనేక నగరాలు, పట్టణాల్లో ఇప్పుడు ఇదే పరిస్థితి. లక్షలాదిగా వాహనాల బారులు చూసేందుకు రమ్యంగానే ఉన్నా, వాటివల్ల విడుదలయ్యే కాలుష్యం ప్రజలకు ఊపిరి సలపనివ్వడం లేదు. దీనికితోడు వాతావరణ మార్పులతో అటు చలికాలంలోనూ, ఇటు ఎండా కాలంలోనూ అనేకరకాల కాలుష్యాలు పిల్లాపాపలని, పెద్దలందరినీ కూడా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సరైన మంచినీటి వసతులు లేకపోవడం, ఉన్న భూగర్భజలాలు కాస్తా అడుగంటిపోతుండడం, అద్దెఇళ్ళ బాడుగలు చుక్కలనంటుతుండడం, మురికివాడలు-మురుగు కాలువలు విపరీతంగా పెరుగుతుండడం, వంటివి నగరాల్లో సర్వసాధారణ దృశ్యాలుగానే ఉంటున్నాయి. ఢిల్లీ, ముంబై వంటి మహానగరాలతో పాటు బెంగళూరు, చెన్నై, కోల్‌కతా వంటి మెట్రో నగరాలు నిత్యం నీటిఎద్దడితోను, చెత్తాచెదారం గుట్టలుగుట్టలుగా పేరుకుపోయి కాలుష్యాలతోను, డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా లేక పరమ దుర్గంధభూయిష్టంగానూ ఉంటున్నాయి. ఇవి చాలవన్నట్లు..వాహనాలు పెరిగిపోయి ట్రాఫిక్ సమస్యలతోనూ అల్లాడిపోతున్నాయి. ఒకమోస్తరు పట్టణాలు కూడా దీర్ఘకాలంగా ఇలాంటి సమస్యల సుడిగుండంలోనే పడి కొట్టుమిట్టాడుతున్నాయి. నగరాలు దేశ పురోభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నప్పటికీ, నగరజీవితం నానాటికీ దుర్భరంగా తయారవుతుండడం బాధాకరం. ఇకనైనా ప్రభుత్వాలు వీటిపై శ్రద్ధ పెట్టాలి. ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ జరిగితే తప్ప, వీటి పురోభివృద్ధి సాధ్యం కానే కాదు. దేశంలో నానాటికీ నగరీకరణ, పట్టణీకరణ వేగవంతమవుతున్న నేపథ్యంలో, అందుకు తగ్గట్టుగా ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకోవాలి. విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపారం వంటి వాటి కోసం వచ్చిన ప్రజల్లో అనేకమంది మురికివాడల్లోనే బతుకు లీడుస్తున్నారు. ధరలన్నీ ఆకాశానికంటుతుండడంతో సామాన్యులు ఏం కొనాలన్నా, ఏం తినాలన్నా కష్టంగానే ఉంటోంది. అన్ని ధరలతో పాటు, నగరాల్లో భూముల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో, సామాన్య ప్రజలకి ఉండేందుకు ఇంటి వసతి కాదు కదా, కనీసం చిన్న గూడు కూడా గగనకుసుమంగా మారింది. కాలువలు, చెరువులు, చెట్లకింద పుట్టల కింద.. ఎక్కడపడితే అక్కడ అస్తవ్యస్థమైన జీవితాలతో అత్యధికశాతం మంది పేదలు అవస్థలు పడుతూనే ఉన్నారు. కాలుష్యాల వల్ల శ్వాసకోశ సమస్యల వంటి అనేక రకాల జబ్బులు ప్రజలను వేధిస్తున్నాయి. ఒకవైపు ఆకాశహర్మ్యాలు, మరోవైపు మురికివాడలు.. ఒకవైపు విలాసవంతమైన జీవితాలు.. మరోవైపు కనీస సదుపాయాలు కూడా లేక అల్లాడే జనం. ఒక్కమాటలో చెప్పాలంటే 'పేరు గొప్ప-ఊరు దిబ్బ' గా ఉంటోంది.. మన నగరాల పరిస్థితి. ఈ తేడాలను ఇకనైనా చక్కదిద్దేందుకు ప్రభుత్వాలు నగర సమస్యలపై దృష్టిసారించాలి. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా చూడాలి. మౌలిక సదుపాయాలకు లోటు లేకుండా అవసరమైన బడ్జెట్‌ను కేటాయించి ప్రజల కష్టాలు తీర్చాలి. నగరాల్లో విద్య-వైద్యం వంటి వ్యవస్థలను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు బృహత్ ప్రణాళికలను పట్టాలకెక్కించాలి. మొత్తంగా నగర ప్రజల జీవితాలు మెరుగయ్యేందుకు ప్రభుత్వాలు, పాలకులు చిత్తశుద్ధితో కృషిచేయాలి. ప్రత్యేకించి పరిశుభ్రతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే కాలక్రమేణా నగర జీవనాలు మరింత దుర్భరంగా, దయనీయంగా తయారవుతాయి.

గతంలో వాళ్లు చేశారని.. ఇప్పుడు వీళ్లు చేస్తే వాళ్ళకీ వీళ్ళకీ తేడా ఏముంటుంది?

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న దాడులు ప్రతి దాడులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశం పెట్టి స్పందించడం మంచిదే. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ శ్రేణులపై జరిగిన దాడులకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కూడా ఆయన మీడియా ముందు ఉంచారు. అయితే, గతంలో వైసీపీ వారు దాడులు చేశారని చెప్పడం ద్వారా చంద్రబాబు ప్రజలకు ఏం చెప్పదలచుకున్నారు? నాడు వారు దాడులు చేశారు కాబట్టి, నేడు మేము కూడా ప్రతీకారం తీర్చుకుంటామనే సందేశం ప్రజలలోకి వెళితే, గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా ఏముంటుంది? గత ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి అనేక కారణాలున్నా, 2024 ఎన్నికల్లో వైసీపీకి కేవలం 11 స్థానాలే దక్కాయి. ప్రజల తీర్పు నుంచి రాజకీయ పార్టీలు గుణపాఠం నేర్చుకోవాలి. అంతేగానీ, గతంలో జరిగిన తప్పులనే మళ్లీ చేస్తే ప్రజలకు కొత్తగా కనిపించేదేముంటుంది? నలభై ఏళ్లకుపైగా రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు గారు ఆలోచించాల్సిన విషయం ఇదే. గతంలో తమ పార్టీ కార్యకర్తలపై దాడులు జరిగాయని చెప్పడమే కాదు, ఇప్పుడు తమ పార్టీ శ్రేణుల నుంచి అలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన భాధ్యత కూడా ఆయనదే. **– డి.హరిత, గూడూరు.**

నేతల భాష మారాలి!

రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజం. అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు ప్రజాస్వామ్యానికి అవసరమే. అయితే ఆ విమర్శలు వ్యక్తిగత దూషణలకు, కుటుంబసభ్యులను కించపరిచే వ్యాఖ్యలకు దారితీయడం ఆందోళనకరం. కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన "మోదీ కా బాప్ భీ జాయేగా" అనే వ్యాఖ్య రాజకీయ విమర్శల స్థాయిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. దేశంలో అత్యున్నత రాజకీయ పదవుల్లో ఉన్న నాయకులు తమ మాటల ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవాలి. కానీ వ్యక్తిగత స్థాయికి దిగజారే వ్యాఖ్యలు రాజకీయాల్లో ఆరోగ్యకరమైన చర్చకు విఘాతం కలిగిస్తాయి. ప్రధాన మంత్రి అయినా, ప్రతిపక్ష నేత అయినా విమర్శలకు అతీతులు కారు. వారి విధానాలను, నిర్ణయాలను, పాలనా వైఫల్యాలను ఆధారాలతో ప్రశ్నించవచ్చు. ప్రజా సమస్యలపై నిలదీయవచ్చు. అవసరమైతే తీవ్రంగా విమర్శించవచ్చు. కానీ ఆ విమర్శలకు హుందాతనం, సంయమనం ఉండాలి. వ్యక్తిగత దూషణలు, కుటుంబాన్ని ప్రస్తావిస్తూ చేసే వ్యాఖ్యలు ప్రజాస్వామ్య చర్చను పక్కదారి పట్టిస్తాయి. జాతీయ స్థాయిలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నాయకులు మాట్లాడే ప్రతి మాట దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతుంది. వారి భాషను కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు అనుసరించే అవకాశం ఉంటుంది. అగ్రనేతలే అనుచిత వ్యాఖ్యలకు దిగితే, రాజకీయాల్లో పరస్పర గౌరవం ఎలా నిలుస్తుంది? ప్రజలకు ఎలాంటి సందేశం వెళుతుంది? రాజకీయాలు మారాలంటే ముందు నేతల భాష మారాలి.

యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

ఎల్‌నినోను ఎదుర్కొందాం!

మనసులో మాట 121

ప్రకృతి ఇచ్చే సంకేతాలను సమయానికి గుర్తించి అప్రమత్తం కాకపోతే సమాజం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో నీటి లభ్యతపై ఆందోళనలు పెరుగుతున్న వేళ, ప్రభుత్వాలు ముందస్తు చర్యలు చేపట్టడం ఎంత ముఖ్యమో, పౌరులుగా మనమందరం అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించడం కూడా అంతే ముఖ్యం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రెండో పంటకు నీరు ఇచ్చే పరిస్థితి లేదని, తాగునీటికే నిల్వలు పరిమితంగా ఉన్నాయని స్పష్టం చేశారు. అయితే, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ దీనిపై విమర్శలు చేస్తూ.. ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సృష్టించిన మానవ కల్పిత కరవు అని ఆరోపిస్తోంది. దీనికి ప్రతిగా 'మరి గతంలో వచ్చిన కరోనా కేసీఆర్ తెచ్చిందా?' అని కాంగ్రెస్ నేతలు ప్రతివిమర్శలు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే తరహా రాజకీయాలు కనిపిస్తున్నాయి. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వర్షాలు పడవంటూ ప్రత్యర్థులు ప్రచారం చేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలు పెరిగాయని వైఎస్సార్‌సీపీ విమర్శిస్తోంది. నిజానికి ధరల పెరుగుదలను ఒక్క రాష్ట్రానికో, ఒక ప్రభుత్వానికో పరిమితం చేయలేం. అంతర్జాతీయ ఇంధన ధరలు, రవాణా వ్యయాలు, ఉత్పత్తి ఖర్చులు, సరఫరా వ్యవస్థల్లో ఆటంకాలు, పంటల దిగుబడులు వంటి అనేక అంశాలు ధరలను ప్రభావితం చేస్తాయి. పశ్చిమాసియా సంక్షోభం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కూడా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలపై ప్రభావం చూపిన పరిణామాలే. రాజకీయ నాయకుల వైఖరిని మనం వెంటనే మార్చలేకపోవచ్చు. కానీ సమస్యలను ఎదుర్కొనేందుకు మన సన్నద్ధతను మాత్రం మెరుగుపరుచుకోవచ్చు.

ప్రస్తుతం నీటి నిల్వల పరిస్థితిని పరిశీలిస్తే, సమస్య తీవ్రత అర్థమవుతుంది. 2026 అక్టోబరు 1 నాటి గణంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన జలాశయాల నిల్వలు 35.14 శాతంగా ఉండగా, గత పదేళ్ల సగటు 71.85 శాతంగా ఉంది. అంటే సాధారణ నిల్వల స్థాయి కంటే 36.71 శాతం తక్కువగా ఉంది. తెలంగాణలోనూ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. అక్కడ ప్రస్తుత నిల్వలు 40.75 శాతంగా ఉండగా, గత పదేళ్ల సగటు 78.95శాతం. అంటే 38.20శాతం లోటు నమోదైంది.

భూగర్భ జలాల పరిస్థితి కూడా ఆందోళనను పెంచుతోంది. తెలంగాణ భూగర్భ జలాల శాఖ గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం 2025 సెప్టెంబరులో భూమికి 4.41 మీటర్ల లోతులో ఉండగా, 2026 సెప్టెంబరులో 7.52 మీటర్లకు పడిపోయింది. అంటే గత ఏడాది దాదాపు ఇదే సమయంతో పోలిస్తే నీటి మట్టం సగటున 3.11మీటర్లు మరింత లోతుకు వెళ్లింది. ఈ పరిస్థితులకు ఎల్‌నినో ఒక ముఖ్యమైన వాతావరణ కారకం. ఎల్‌నినో పరిస్థితులు అక్టోబరు–డిసెంబరు కాలంలో మరింత బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే ఎల్‌నినోకు భయపడటం కంటే, దాని ప్రభావాలను శాస్త్రీయంగా అంచనా వేసి ముందస్తు చర్యలు తీసుకోవడం ముఖ్యం.

ఇలాంటి అత్యవసర సమయంలో పౌరులుగా మన బాధ్యత ఏమిటి? నీటి వినియోగం, సంరక్షణపై మన దృక్పథంలోనూ మార్పు రావాలి. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన ముఖ్యమైన అంశం వాటర్ ఫుట్‌ప్రింట్. మనం వినియోగించే వస్తువులు, ఆహార పదార్థాల ఉత్పత్తి వెనుక ఎంత నీరు ఖర్చవుతోందో తెలియజేసే భావన ఇది. 2025లో ప్రచురితమైన ఒక పరిశోధన ప్రకారం, భారతదేశంలో ఒక కిలో వరి ధాన్యం ఉత్పత్తికి సగటున 1,500 నుంచి 2,000 లీటర్ల నీటి వినియోగం ఉంది. వరి సాగుకు అధిక నీరు అవసరమయ్యే పరిస్థితుల్లో, ప్రాంతీయ నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా పంటల ప్రణాళిక రూపొందించడం జల వనరులపై ఒత్తిడిని పెంచుతుంది. సమాజంలోని ఆహారపు అలవాట్లూ పంటల సాగుపై ప్రభావం చూపిస్తాయి. వరి వినియోగం నుంచి తృణధాన్యాల వినియోగం వైపు సమాజం మళ్లితే ప్రయోజనం ఉంటుంది. సాగులో నీటి వినియోగం తగ్గడంతో పాటు వరి ధాన్యంతో పోలిస్తే పోషకాలూ పెరుగుతాయి.

దైనందిన జీవితంలో మనం చేసే చిన్న చిన్న నిర్లక్ష్యాలు కూడా సమష్టిగా పెద్ద మొత్తంలో నీటి వృథాకు దారితీస్తాయి. కుళాయిలు లీకవుతున్నా పట్టించుకోకపోవడం, అవసరానికి మించి నీటిని వాడటం, వాహనాలు లేదా ప్రాంగణాలను శుభ్రం చేయడానికి తాగునీటిని అధికంగా వినియోగించడం వంటి అలవాట్లను మార్చుకోవాలి. ఆర్‌ఓ ప్యూరిఫైయర్ల నుంచి వెలువడే వ్యర్థ నీటిని దాని నాణ్యతను బట్టి, అనువైన పనులకు పునర్వినియోగించుకోవచ్చు. అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, పాఠశాలలు, వాణిజ్య సముదాయాల్లో నీటి పొదుపు చర్యలను సమర్థంగా అమలు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వాల బాధ్యతను తక్కువగా చూడలేం. సరఫరా వ్యవస్థల్లో లీకేజీలను అరికట్టడం, జలాశయాల్లోని నీటిని ప్రాధాన్యాల ప్రకారం వినియోగించడం, భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం అత్యవసరం. చెరువుల పరిరక్షణ, కాలువల నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, మురుగునీటి శుద్ధి–పునర్వి నియోగం వంటి అంశాలకు దీర్ఘకాలిక ప్రణాళికలో స్థానం కల్పించాలి. నిత్యావసరాల ధరల విషయంలో అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత వంటి పనులు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. నీటి కొరత ఏర్పడిన తర్వాత ప్రత్యామ్నాయాల కోసం వెతకడం కంటే, సంక్షోభం రాకముందే సన్నద్ధం కావడం అత్యవసరం. నీటిని అంతులేని వనరుగా కాకుండా పరిమితమైన సహజ సంపదగా భావించి పొదుపుగా వినియోగించాలి. భావి తరాలకు జల వనరులను అందించాలంటే బాధ్యతను ఈ రోజే గుర్తించాలి.

- తుమ్మల బాల గంగాధర్ తిలక్

సమన్వయంతో విజయం సాధిస్తాం

• మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

మంత్రి ఆనం సమక్షంలో తెదేపాలో చేరిన చేజర్ల మండలానికి చెందిన నాయకులు

ఆత్మకూరు పురపాలక ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమి సమన్వయంతో ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తున్నామని, అందరం కలసి కట్టుగా విజయం సాధిస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇటీవల ఆయన ఆత్మకూరులో ప్రజలతో మాట్లాడుతూ, ఈ నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమికి ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతుకు వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలే నిదర్శనమని అన్నారు. ఆత్మకూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు, ప్రముఖులు, వైసీపీ కార్యకర్తలు టీడీపీ వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వంపై విశ్వాసంతోనే నాయకులు, కార్యకర్తలు ఎన్డీఏలో చేరుతున్నారన్నారు. ఎన్నికల్లో ఈ ఐక్యత కూటమి విజయానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

రాష్ట్రంలో రాజకీయ కక్షలు, దాడులకు తావులేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని మంత్రి ఆనం ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, రాజకీయ పార్టీలన్నీ రాజ్యాంగ విలువలను గౌరవించాలని సూచించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే రాజకీయాలు చేయాలని అన్నారు. గత కొన్నేళ్లుగా ఆత్మకూరు నియోజకవర్గం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని మంత్రి ఆనం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆత్మకూరును ఆంధ్రప్రదేశ్‌లోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు.

డాక్టర్ షకీలాని గెలిపించండి

ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలాను గెలిపించాలని మంత్రి ఆనం విజ్ఞప్తిచేశారు. డాక్టర్ షకీలా కుటుంబం చాలాకాలంగా ఆత్మకూరు ప్రాంత ప్రజలతో మమేకమైందని, ఆమె తండ్రి దశాబ్దాలుగా వైద్య సేవలందించి మంచి పేరు సంపాదించారని పేర్కొన్నారు. వైద్య వృత్తి ద్వారా ప్రజలకు సేవలందించిన డాక్టర్ షకీలా, ఇప్పుడు ప్రజాప్రతినిధిగా మరింత విస్తృతంగా సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. డాక్టర్ షకీలాతో పాటు టీడీపీ తరఫున 25 వార్డుల్లో, జనసేన, బీజేపీ తరఫున మూడు వార్డుల్లో బరిలో ఉన్న కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు.

'స్థానిక' వ్యూహాలపై..

కాకర్ల కీలక సమావేశం

నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకార్ల సురేష్

మండల కేంద్రమైన వరికుంటపాడులో ఇటీవల ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై కీలక సమావేశం నిర్వహించారు. నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, వరికుంటపాడు మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావుతో పాటు మండలానికి చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తల సమన్వయం, ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు చర్చించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రజల మద్దతుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా, నాయకులు, కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

శ్రీసిటీలో..తిరుచ్చి ఎన్ఐటీ బృందం

ఎన్ఐటీ బృందంతో శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

తిరుచిరాపల్లి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) డైరెక్టర్ డాక్టర్ జి.అఖిలా ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. ఆమెతో పాటు రిజిస్ట్రార్, డీన్లు, ప్రొఫెసర్లు, ఇతర ఉన్నతాధికారులు పర్యటనలో పాల్గొన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ బృందానికి సాదర స్వాగతం పలికారు. తాను చదువుకున్న ఎన్ఐటీ తిరుచిరాపల్లి నుంచి ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థిగా కళాశాల జ్ఞాపకాలను పంచుకుంటూ, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులకు పరిశ్రమల్లో ప్రత్యక్ష అనుభవం కల్పించడంలో విద్యాసంస్థలు–పరిశ్రమల భాగస్వామ్యం కీలకమని చెప్పారు. శ్రీసిటీ సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను ప్రతినిధి బృందానికి వివరించారు. శ్రీసిటీ త్రీడీ నమూనా, వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలు, అక్కడ తయారవుతున్న ఉత్పత్తులను ప్రదర్శించారు. ఐఐటీ, క్రియా యూనివర్సిటీ, శ్రీసిటీ ఇంటర్నేషనల్ స్కూల్ వంటి ప్రముఖ విద్యాసంస్థల ఉనికిని వివరిస్తూ, పరిశ్రమలతో పాటు విద్యారంగానికి కూడా శ్రీసిటీ ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదుగుతోందని వివరించారు. అనంతరం ప్రతినిధి బృందం శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆల్స్టామ్, డేనియెలీ, పానాసోనిక్, థెర్మాక్స్ పరిశ్రమలను సందర్శించారు. పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రక్రియలు, ఆధునిక తయారీ విధానాలు, పారిశ్రామిక సామర్థ్యాలను పరిశీలించారు. డాక్టర్ అఖిలా మాట్లాడుతూ, శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, ఆధునిక పరిశ్రమల పని తీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో శ్రీసిటీతో కలిసి పనిచేసేందుకు తమ సంస్థ ఆసక్తిగా ఉందని తెలిపారు.

సీతారాంపురం క్లీన్‌స్వీప్!

జిల్లాలోనే సంచలనం
ఫలించిన ఎమ్మెల్యే కాకర్ల కృషి

జిల్లాలో అనేక స్థానాల్లో కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేసి, ఎంపీటీసీ–జడ్పీటీసీ ఎన్నికల్లో తమకెదురే లేదని నిరూపించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఏకగ్రీవమైన స్థానాల్లో ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురం మండలం ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేసిన కృషికి ఈ ఫలితం తార్కాణంగా నిలిచింది. ఈ మండలంలోని 7 ఎంపీటీసీలు, 1 జడ్పీటీసీ ఏకగ్రీవమయ్యాయి. ఉదయగిరి నియోజకవర్గంలోని మిగిలిన మండలాల్లో మరో 10 ఎంపీటీసీ స్థానాలు కూడా ఏకగ్రీవం కావడం ఎమ్మెల్యే సురేష్ కార్యదీక్షకి నిదర్శనం.

ఉదయగిరి నియోజకవర్గంలో 8 మండలాలు ఉండగా సీతారామపురం మండలంలోని జడ్పీటీసీ స్థానంతో పాటు, మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికకావడం జిల్లాలో పెద్ద సంచలనమైంది. ప్రత్యర్థి పార్టీ వైసీపీ ఈ మండలంలో తమ అభ్యర్థులను పోటీలో నిలపలేకపోయింది. అంతేకాక నియోజకవర్గంలోని ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో 10 ఎంపీటీసీ స్థానాలను కూటమి పార్టీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. ఉదయగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి పలు గ్రామాల ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతుండడంతో, వారితో పోటీ చేయడానికి వైసీపీకి అభ్యర్థులు కరువయ్యారు. ఇంతటి స్థాయిలో జిల్లాలో ఒక మండలం మొత్తం జడ్పీటీసీ, ఎంపిటిసి స్థానాలు కైవసం చేసుకున్న దాఖలాలు బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. మిగిలిన ఏడు మండలాలు కూడా ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాలు ఎంపీపీ పదవులు కైవసం చేసుకునే దిశగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషి చేస్తున్నారు.

వేడివేడి దోసెలు, బోండాలు!

షరణి వినూత్న ప్రచారం

వేడివేడి దోసెలు, బజ్జీలు అంటూ మంత్రి నారాయణ తనయ షరణి తన ఎన్నికల ప్రచారాన్ని మరింత ఆకట్టుకునేలా నిర్వహించారు. సాధారణంగా ఎన్నికల వేళ రాజకీయ నాయకులు ఇచ్చే మైకుల హోరు, భారీ వాగ్దానాల జోరు మాత్రమే మనకు కనిపిస్తుంది.. కానీ ఇటీవల నెల్లూరు 15వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఆమె ఏ మాత్రం ఆర్భాటాలు ప్రదర్శించకుండా, నేరుగా ఒక సామాన్యమైన టిఫిన్ షాప్‌లోకి అడుగుపెట్టి.. పెనంపై వేడివేడి దోసెలు వేస్తూ, ఘుమఘుమలాడే బోండాలు, కరకరలాడే బజ్జీలను స్వయంగా తయారు చేసి ఒకసారి టేస్ట్ చూడండి.. ఎలా ఉందో చెప్పండి.. అంటూ ప్రజలకి ఆత్మీయంగా అందించడం అందరినీ ఆకర్షించింది. 15వ డివిజన్ జనసేన కూటమి కార్పొరేటర్ అభ్యర్థి గుర్రం కెజియాకుమారి, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్‌యాదవ్ గెలుపును కాంక్షిస్తూ ఆమె డివిజన్‌లో పర్యటించి, ఇంటింటికీ తిరిగి ఓటర్లను తమ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

అదాని కృష్ణపట్నం పోర్టుకి..అవార్డుల పరంపర

క్వాలిటీ సర్కిల్ ఫోరం నుంచి 15 బహుమతులు

తిరుపతిలోని క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా వారు ఇటీవల నిర్వహించిన 12వ వార్షిక కన్వెన్షన్ ఆఫ్ కాన్సెప్ట్‌లో నెల్లూరుజిల్లాలోని అదాని కృష్ణపట్నం పోర్టుకు ఏకంగా 15 అవార్డులు లభించాయి. కార్యచరణ నైపుణ్య,ం, ఉద్యోగుల నియామకం, నాణ్యమైన సంస్కృతి, స్థిరమైన వ్యాపార పరివర్తనలో అత్యుత్తమ కృషికి గుర్తింపుగా ఈ పోర్టును 'అత్యుత్తమ పరివర్తన సంస్థ'గా గుర్తించి అవార్డును ప్రదానం చేసి, సన్మానించారు. అంతేకాక నౌకాశ్రయం కాన్సెప్ట్‌లో 9 స్వర్ణ అవార్డులు, ఒక రజత అవార్డు, వివిధ విభాగాల్లో మరో 3 వ్యక్తిగత అవార్డులను కూడా సాధించడం విశేషం. ఈ సందర్భంగా పోర్టు సీఇఓ జగదీష్ పటేల్ మాట్లాడుతూ, ఉద్యోగుల అంకితభావం, ప్రతిభాపాటవాలకి ఇదొక నిదర్శమని, నాణ్యత ఆధారిత కార్యక్రమాల ద్వారా స్థిరమైన వృద్ధిని సాధించడానికి ఇలాంటి అవార్డులు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఆటిజం కేంద్రం పరిశీలన

నెల్లూరు బీవీనగర్ కేఎన్ఆర్ మునిసిపల్ పాటశాలలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఆటిజం కేంద్రాన్ని ఈనెల 27న తిరుపతి జిల్లా ఏఐ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇంజనీరింగ్ సిబ్బంది సందర్శించారు. కేంద్రం నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. ఈ కేంద్రం తరహాలోనే తిరుపతిలోనూ ఒక ఆటిజం కేంద్రాన్ని నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

టీడీపీలో చేరిన ఆర్ఎస్ఆర్!

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారపార్టీ అయిన తెలుగుదేశం పట్ల ఆకర్షితులవుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరిపోతున్నారు. తాజాగా, వైసీపీ సీనియర్ నాయకుడు రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) వారి మిత్రబృందం ఇటీవల రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిది కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనను కోటంరెడ్డి సోదరులు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆర్ఎస్ఆర్‌కి ఎప్పుడూ తమవంతు ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చెప్పారు.

ఎన్నికల వ్యయ వివరాలు.. పక్కాగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల వ్యయ వివరాలను పక్కాగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.సాయిబాబు స్పష్టం చేశారు. ఈనెల 28న నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించి అధికారులు సమర్పించాల్సిన నివేదికలు, అభ్యర్థులు సమర్పించాల్సిన ఖర్చుల వివరాలపై అధికారులకు వివరించారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం పక్కాగా నమోదు చేసి, నిర్దేశిత సమయంలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ మధుసూదన్, డిప్యూటీ సీఈఓ బ్రహ్మయ్య, జిల్లా సహకార అధికారి బి. గురప్ప, జిల్లా ఆడిట్ అధికారి డి. సింహాద్రి, నోడల్ అధికారులు, ఎన్నికల వ్యయ పరిశీలన బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు కబుర్లు

72 స్థానాల్లోనూ..

కూటమి గెలవాలి

➢ అదే లక్ష్యమన్న..ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు నగర కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి తరపున పోటీచేస్తున్న 72 మంది కార్పొరేటర్ అభ్యర్థుల విజయమే తమ లక్ష్యమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 27న ఆయన నెల్లూరులోని తమ కార్యాయలంలో తమ అభ్యర్థులందరికీ ఆత్మీయ విందు ఏర్పాటుచేసి, విజయం కోసం చేపట్టాల్సిన ప్రచార వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ..ఈ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అభ్యర్థుల విజయం కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్, 72 మంది కూటమి కార్పొరేటర్ అభ్యర్థులతో పాటు, మంత్రి పొంగూరు నారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజీజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జనసేన నేత, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ ఎన్నికల పరిశీలకులు దూండీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

మైనారిటీల పట్ల కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు మైనార్టీలకు అన్యాయం చేసేవిధంగా ఉన్నాయని వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల ఆయన నెల్లూరు 57వ డివిజన్‌లో వైసీపీ మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి, 57వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి షేక్ అస్మాతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ తరపున పోటీ చేస్తున్న మైనారిటీ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా.. కూటమి ప్రభుత్వ పెద్దలు దుశ్చర్యలు సాగించారని ఆయన ధ్వజమెత్తారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా, కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

శ్రీసాయి సచ్చరిత్రలతో..అఖండ పారాయణం

నెల్లూరు బాలాజీ నగర్ చివరన పద్మావతి నగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో శ్రీ షిరిడీ సాయిబాబా 108వ మహాసమాధి ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఈనెల 25న 108 మంది భక్తులతో 108 శ్రీ సాయి సచ్చరిత్ర గ్రంథాలతో అఖండ పారాయణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కొనసాగిన ఈ పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ సాయినాథుని నామస్మరణతో, శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణంతో పులకించిపోయారు. శ్రీ సాయిదర్బార్ ఛైర్మన్ మధుసాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీ సాయి సచ్చరిత్ర గ్రంథాలను ఉచితంగా అందజేశారు. తెనాలి వాస్తవ్యులు ఉమారాణి ఈ వేడుకకు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పోలంరెడ్డికి..బీఎంఆర్ శుభాకాంక్షలు

ఇందుకూరుపేట జడ్పీటీసీ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని రాజ్యసభ సభ్యులు డా. బీద మస్తాన్‌రావు అభినందించారు. ఇటీవల నెల్లూరులో పోలంరెడ్డిని కలసి ఆయనకు శుభాభినందనలు తెలియజేశారు.

మహిళల ఆరోగ్యం..

కుటుంబానికి సౌభాగ్యం!

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆయా కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. ఈనెల 24న నెల్లూరు నగరంలోని గాంధీ బొమ్మ వద్ద నుంచి రెడ్‌క్రాస్ కార్యాలయం వరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రొమ్ము క్యాన్సర్ అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకునేలా చైతన్యం తీసుకు రావాలని అధికారులకు చెప్పారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బలంగా ఉంటుందని, మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన తెలిపారు. తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తం అందించడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా రెడ్‌క్రాస్ సంస్థ ఎంతోమందికి అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

బ్రహ్మశ్రీ 'పోలూరి' వారి జయంతి

కుప్పా విశ్వనాథ శాస్త్రిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరుకు చెందిన మహాకవిపండితులు.. బ్రహ్మ విద్యాచార్య.. బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ 102వ జయంతి సందర్భంగా ఈనెల 27న నెల్లూరు టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో సభ జరిగింది. నెల్లూరు వేదసంస్కృత కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు బ్రహ్మశ్రీ చింతలపాటి పూర్ణానంద శాస్త్రి సభకు అధ్యక్షత వహించి పోలూరి హనుమజ్జానకీ రామ శర్మ రచనా వైదుష్యాన్ని వివరించారు. ముఖ్యఅతిథి డాక్టరు చీమకుర్తి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ, పోలూరి వారి రచనలు ఎంత గొప్పవో విశదీకరించారు. పంచరత్న పద్యాలు చదివి పోలూరి వారి ట్రస్టు తరపున ఉపన్యాసకులకు సమర్పించారు. తిరుపతి జాతీయ సంస్కృత కళాశాల న్యాయ శాస్త్ర విభాగ ప్రధానాచార్యులు, దూరదర్శన్ ప్రవచకులు బ్రహ్మశ్రీ కుప్పా విశ్వనాథ శాస్త్రి 'జానకిరామ శర్మగారిచే రచించబడిన త్రిపురా రహస్య జ్ఞాన ఖండ సారము' అనే గ్రంథాన్ని గూర్చి ఉపన్యసించారు. వేదం వెంకట రాధాకృష్ణ సభా సంచాలకులుగా వ్యవహరించారు. నలుబోలు బలరామయ్యానాయుడు, పోలవరపు లక్ష్మీనరసింహారావు, డా. గిరిజాలక్ష్మి, లక్ష్మీనారాయణ, సుభద్రాదేవి, నరసింహమూర్తి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్‌తో జాగ్రత్త

అర్నబ్ తుఫాన్‌తో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఈనెల 27న ప్రజలకు సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యంగా తీరప్రాంతాల్లోను, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీచేశారు. తుఫాన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల పరిశీలనకు.. మైక్రో అబ్జర్వర్లు

స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలనకు ఎన్నికల పరిశీలకురాలు సదాభార్గవి ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్ల నియమాకం చేపట్టారు. ఆత్మకూరు, బుచ్చి మునిసిపాలిటీలతో పాటు, నెల్లూరు నగరపాలక సంస్థకి సంబంధించి మొత్తం 74 మందిని మైక్రో అబ్జర్వర్లు అవసరం కాగా, 62 మందిని ప్రధాన కేటాయింపు జాబితాలో కేటాయించి, మరో 12 మందిని రిజర్వ్‌లో ఉంచారు. ఆత్మకూరుకు 14 మంది, బుచ్చిరెడ్డిపాళెంకి 5గురు, నెల్లూరు కార్పొరేషన్‌కి 55 మంది వంతున మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో నగరవ్యాప్తంగా పోలీసు అధికారులు ఈనెల 27న ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గస్తీలు, కార్డెన్‌సెర్చ్ ముమ్మరం చేశారు. నగర ఎస్‌డీపీఓ ఆధ్వర్యంలో సంతపేట ఇన్స్‌పెక్టర్ సోమయ్య సారధ్యంలో నగరంలో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టి, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నవాబుపేట ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని, రైతులు ఈ విధానాన్ని అవగాహన చేసుకుని ఆచరించాలని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయకుమార్ సూచించారు. ఈనెల 27న నెల్లూరులోని కృషి విజ్ఞానకేంద్రంలో ఎస్‌సీ సబ్‌ప్లాన్ రైతులకు సహజవనరులతో ఎరువులు, పురుగు నివారణ మందుల తయారీపై ఆయన అవగాహన కలిగించారు. అవసరమైన ఎరువులును, చీడపీడల నివారణకు ఉపయోగపడే కషాయాలను రైతులు స్వయంగా తయారుచేసుకోవాలని సూచించారు. కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సరళ, వ్యవసాయశాఖ డీడీ సుమలత, డీపీఎం కె. కన్నయ్య, లీడ్‌బ్యాంక్ ప్రతినిధి రవిశంకర్ పాల్గొన్నారు.

జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా

మంత్రి నారాయణ రోడ్ షో

రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగర కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. టీడీపీ అభ్యర్థులతో పాటు జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపునూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అందులో భాగంగా 7, 15 డివిజన్లలో మంత్రి నారాయణ ఇటీవల నిర్వహించిన రోడ్‌షోలకు కార్యకర్తలు, ప్రజలు అనూహ్యంగా తరలివచ్చారు. 21వ డివిజన్ ప్రచారంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి సిరిగిరి లక్ష్మిని, జనసేన అభ్యర్థులు కెజియాకుమారి, గునుకుల లక్ష్మీలను, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డిలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, సీఎం చంద్రబాబు పాలనలో ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలంటే వివాదాలు, విమర్శలు, పరస్పర దూషణలు కనిపించేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. అభివృద్ధినే అజెండాగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, నెల్లూరు అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. మేయర్ స్థానంతో పాటు అన్ని డివిజన్లలోనూ కూటమి అఖండ విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

అందుబాటులో ఉండేవారినే.. ఎన్నికల్లో నిలిపాం!

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రజల్లో నిత్యం కలిసిమెలిసి ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చొరవచూపే నాయకులనే నెల్లూరు నగర పాలక సంస్థ ఎన్నికల బరిలో నిలిపామని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు నగరాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే అనుభవజ్ఞులైన నాయకత్వానికి అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. 'చెప్పాం.. చేస్తున్నాం' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఆయన నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 27, 32 డివిజన్లలో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ అభ్యర్థులు నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి, మేకల మధులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వారు ప్రజలకు వివరించారు.

రూప్‌ను గెలిపించాలి :

మేయర్ అభ్యర్థిగా కూటమి తరఫున పోటీ చేస్తున్న పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ 2005లో కార్పొరేటర్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా డిప్యూటీ మేయర్ స్థాయికి ఎదిగారని ఎంపీ వేమిరెడ్డి గుర్తుచేశారు. గతంలో కొంతకాలం మేయర్‌గా, ఇన్‌ఛార్జి మేయర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఆయనకు ఉందన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పట్టుదలతో పనిచేసే నాయకుడని, అందుకు పొట్టేపాళెం వంతెన ఒక ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. అదేవిధంగా నగరాభివృద్ధికి మంత్రి నారాయణ చేస్తున్న కార్యక్రమాలు అపూర్వమన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారని కొనియాడారు.

శ్రీసిటీ-ఇసుజు మోటార్స్ దశాబ్ది సంబరాలు

- లక్షకు పైగా వాహనాల ఉత్పత్తితో అగ్రస్థానం

ప్రముఖ వాహన తయారీ సంస్థ ఇసుజు మోటార్స్ ఇండియా శ్రీసిటీలో తన పదేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈనెల 26న పరిశ్రమ ఆవరణలో వేడుకలు నిర్వహించింది. ఆ సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ పదేళ్లలో సంస్థ లక్షకుపైగా వాహనాలను ఉత్పత్తి చేయడంతో పాటు, దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతుల కేంద్రంగా ఎదగడం విశేషం. ఈ కార్యక్రమానికి ఇసుజు గ్రూప్ ప్రెసిడెంట్, సీఈఓ నవోహిరో యమగుచి, మిత్సుబిషి కార్పొరేషన్ మొబిలిటీ గ్రూప్ సీఈఓ షిగేరు వకబయాషి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ యువరాజ్, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు పాల్గొని ఆ సంస్థ ప్రగతిని అభినందించారు. ఇసుజు మోటార్స్ పదేళ్ల అభివృద్ధిపై డాక్టర్ యువరాజ్ హర్షం వ్యక్తం చేశారు. మరింత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. శ్రీసిటీ ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ఇసుజు మోటార్స్ 2013లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న రోజు నుంచి సంస్థ అభివృద్ధిని ప్రత్యక్షంగా వీక్షించడం తనకు ఆనందంగా ఉందన్నారు. ఇసుజు గ్రూప్ ప్రెసిడెంట్, సీఈఓ నవోహిరో యమగుచి, ఇసుజు ఇండియా చైర్మన్ కెంజిరో హెమ్మసన్ పరిశ్రమ ప్రగతి, పదేండ్లలో సాధించిన విజయాలు, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. కాగా, గత పదేళ్లలో ఇసుజు మోటార్స్ శ్రీసిటీప్లాంట్‌లో సుమారు రూ. 1,500కోట్ల పెట్టుబడులు పెట్టగా, సుమారు 1,600మందికి ఉపాధి కల్పించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 20,000కు పైగా వాణిజ్య వాహనాలను ఎగుమతి చేసి, భారత్ వాణిజ్య వాహనాల ఎగుమతుల్లో అగ్రస్థానాన్ని సాధించింది కూడా.

ఆత్మకూరులో 'ఆనం హవా'

- 30 ఎంపీటీసీలు ఏకగ్రీవం

ఆత్మకూరు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో మొత్తం 67 ఎంపీటీసీ స్థానాలకు గాను 30 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. మొత్తం స్థానాల్లో 45 శాతం స్థానాలు పోలింగ్‌కు ముందే ఏకగ్రీవం కావడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. మర్రిపాడు మండలంలోని 7 స్థానాలు.. వరుసగా మర్రిపాడు, సింగనపల్లి, బూదవాడ, నందవరం, పొంగూరు, భీమవరం, ఏపిలగుంట ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా, చేజర్ల మండలంలో 9 స్థానాలు.. టీకేపాడు, పాడేరు, మాముడూరు, నెర్నూరు, వావిలేరు, పుట్టుపల్లి, నాగులవెల్లటూరు, తూర్పుపల్లి, మడపల్లి ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. సంగం మండలంలో 6 స్థానాలు.. పడమటిపాలెం, మర్రిపాడు, వంగల్లు, పెరమన, కొరిమెర్ల, జండాదిబ్బ ఎంపీటీసీ స్థానాల్లో, అనుమసముద్రంపేట మండలంలో 4 స్థానాలు..గుంపర్లపాడు, సీబీవరం, హసనాపురం, చిరమన ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ ఏకగ్రీవంగా నిలిచింది. అనంతసాగరం మండలంలో 3 స్థానాలు.. బొమ్మవరం, దేవరాయపల్లి బిట్-1, ఆమనిచిరువెళ్ల, ఆత్మకూరు మండలంలో.. చెర్లోయడవల్లి స్థానంలో టీడీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జెన్‌జీ యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యం

ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

రోడ్‌షోలో ప్రజలకి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జెన్ జీ యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యమిస్తూ, ప్రజాసేవలో భాగస్వాములు కావడానికి ప్రోత్సహిస్తున్నారని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వస్తున్న యువతకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. యువత రాజకీయాల్లోకి రావడం ద్వారా ప్రజాసేవలో కొత్త ఆలోచనలు, నూతన ఉత్సాహం వస్తాయని పేర్కొన్నారు. 'చెప్పాం.. చేస్తున్నాం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఆమె బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలోని 26, 27 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి దొడ్ల విజయలక్ష్మితో పాటు 26వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నిడిగుంట వెంకట శ్రావణి, 27వ వార్డు అభ్యర్థి ఆత్మకూరు మల్లికార్జునను గెలిపించాలని కోరారు.

బీజేపీ నాయకుల ర్యాలీ

నెల్లూరు నగర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ఎన్నికల్లో బీజేపీ-జనసేన-టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని 43వ డివిజన్‌లో ఆయన బీజేపీ నాయకులు వాకాటి నారాయణరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు.

అసత్యాల అల్లకల్లోలంలో విమర్శనాత్మక ఆలోచన: నిజాన్ని గుర్తించే మనసు శక్తి

ఈ రోజుల్లో ప్రపంచం సమాచారంతో నిండిపోయింది. కానీ ఆ సమాచారంలో ఎంత నిజం ఉంది? ఎంత అసత్యం ఉంది? ఎంత వక్రీకరణ ఉంది? ఈ ప్రశ్నలకు సమాధానం కనుగొనడం సులభం కాదు. ముఖ్యంగా యువతకు ఇది మరింత క్లిష్టం. ఎందుకంటే వారు చూసే ప్రతి విషయం, వీడియో, సందేశం, వార్త, వ్యాఖ్య..వెంటనే నమ్మదగినదిగా కనిపిస్తుంది. “చూసినది నిజం కాదు; పరిశీలించినదే నిజం” అనే మాట ఈ కాలానికి అద్దం. అసత్యాల అల్లకల్లోలంలో మనసును నిలబెట్టేది విమర్శనాత్మక ఆలోచన (critical thinking). విమర్శనాత్మక ఆలోచన అంటే అనుమానం కాదు; అది పరిశీలన. అది ప్రతిదాన్ని ప్రశ్నించడం కాదు; సరైన ప్రశ్నలను అడగడం. ఒక విద్యార్థి ఒక వార్తను చదివినప్పుడు, “ఇది నిజమా?” అని అడగడం విమర్శనాత్మక ఆలోచన. ఒక యువతి ఒక వీడియో చూసినప్పుడు, “ఇది ఎక్కడి నుంచి వచ్చింది?” అని ఆలోచించడం విమర్శనాత్మక ఆలోచన. ఒక యువకుడు ఒక వ్యాఖ్యను చదివినప్పుడు, “ఇది ఎవరి ప్రయోజనానికి?” అని తెలుసుకోవడం విమర్శనాత్మక ఆలోచన. ఈ ఆలోచన మనసును రక్షిస్తుంది, నిర్ణయాలను బలపరుస్తుంది, భవిష్యత్తును వెలిగిస్తుంది.

ఉదాహరణకు, ఒక విద్యార్థి సామాజిక మాధ్యమం (social media) లో ఒక వార్త చూసి వెంటనే నమ్మితే, అతను అసత్యానికి బలి అవుతాడు. కానీ అతను ఆ వార్తను రెండు వేర్వేరు మూలాల్లో చూసి, నిజానిజాలు పరిశీలిస్తే, అతను జ్ఞానవంతుడవుతాడు. ఒక యువతి ఒక వీడియో చూసి వెంటనే స్పందిస్తే, ఆమె భావోద్వేగానికి లోనవుతుంది. కానీ ఆమె ఆ వీడియోను పరిశీలించి, అది ఎడిట్ (edited) అయిందా, వక్రీకరించబడిందా అని చూసుకుంటే, ఆమె విమర్శనాత్మక ఆలోచనను ఉపయోగించినట్టే. ఒక యువకుడు ఒక వ్యాఖ్యను చదివి వెంటనే కోపపడితే, అతను భావోద్వేగానికి గురవుతాడు. కానీ అతను ఆ వ్యాఖ్య వెనుక ఉన్న ఉద్దేశాన్ని తెలుసుకుంటే, అతను జ్ఞానవంతుడవుతాడు. విమర్శనాత్మక ఆలోచన ఒక నైపుణ్యం; అది అభ్యాసంతో పెరుగుతుంది. విద్యార్థులు ప్రతిరోజూ చిన్నచిన్న చర్యలతో ఈ నైపుణ్యాన్ని బలపరచవచ్చు. మొదట, వారు చూసే ప్రతి సమాచారాన్ని “మూలం ఏమిటి?” అని ప్రశ్నించాలి. ఇది సమాచార మూల విశ్లేషణ (source analysis) అనే నైపుణ్యాన్ని పెంచుతుంది. రెండవది, ఒక వార్తను చదివినప్పుడు వెంటనే నమ్మకుండా, “ఇది నిర్ధారించడానికి ఇంకేం ఆధారం ఉంది?” అని ఆలోచించాలి. ఇది ఆధార పరిశీలన (evidence checking) అనే నైపుణ్యాన్ని పెంచుతుంది. మూడవది, ఒక వీడియోను చూసినప్పుడు, “ఇది భావోద్వేగాన్ని ప్రభావితం చేయడానికి రూపొందించబడిందా?” అని ఆలోచించాలి. ఇది భావోద్వేగ అవగాహన (emotional awareness) అనే నైపుణ్యాన్ని పెంచుతుంది. నాలుగవది, ఒక అభిప్రాయాన్ని

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

(opinion) చదివినప్పుడు, “ఇది నిజం కాదు; ఇది ఒకరి దృష్టికోణం మాత్రమే” అని గుర్తించాలి. ఇది అభిప్రాయం–నిజం వేర్పాటు (fact-opinion separation) అనే నైపుణ్యాన్ని పెంచుతుంది. ఈ చర్యలు ప్రతిరోజూ చేస్తే, విమర్శనాత్మక ఆలోచన ఒక అలవాటుగా మారుతుంది.

విమర్శనాత్మక ఆలోచన యువతకు ధైర్యాన్ని ఇస్తుంది. ఎందుకంటే అది మనసును స్థిరంగా ఉంచుతుంది. అసత్యం ఎంత పెద్దదైనా, విమర్శనాత్మక ఆలోచన ఉన్న మనసు దానిని గుర్తిస్తుంది. “నిజం నిశ్శబ్దంగా ఉంటుంది; అసత్యం శబ్దం చేస్తుంది” అనే మాట యువతకు మార్గదర్శకం. నిజం ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. అసత్యం ఎప్పుడూ హడావుడిగా ఉంటుంది. విమర్శనాత్మక ఆలోచన ఈ రెండింటిని వేరు చేస్తుంది. విమర్శనాత్మక ఆలోచన యువతకు నిర్ణయ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఒక విద్యార్థి ఒక సమాచారం చూసినప్పుడు, “ఇది నన్ను ప్రభావితం చేస్తుందా?” అని ఆలోచిస్తే, అతని నిర్ణయం బలంగా ఉంటుంది. ఒక యువతి ఒక వార్తను చదివినప్పుడు, “ఇది నమ్మదగిన మూలం నుంచా?” అని తెలుసుకుంటే, ఆమె నిర్ణయం స్పష్టంగా ఉంటుంది. ఒక యువకుడు ఒక సందేశాన్ని చూసినప్పుడు, “ఇది నిజమని నిరూపించే ఆధారం ఉందా?” అని పరిశీలిస్తే, అతని నిర్ణయం జ్ఞానంతో నిండిపోతుంది.

విమర్శనాత్మక ఆలోచన యువతకు స్వీయ గౌరవాన్ని పెంచుతుంది. ఎందుకంటే అది మనసును బలపరుస్తుంది. అసత్యం మనసును కదిలిస్తుంది; నిజం మనసును నిలబెడుతుంది. విమర్శనాత్మక ఆలోచన మనసును నిజం వైపు నడిపిస్తుంది. ఒక విద్యార్థి అసత్యాన్ని గుర్తించగలిగితే, అతనికి ఆత్మవిశ్వాసం (confidence) పెరుగుతుంది. ఒక యువతి అసత్యాన్ని ప్రశ్నించగలిగితే, ఆమెకు ధైర్యం పెరుగుతుంది. ఒక యువకుడు అసత్యాన్ని ఎదుర్కొనగలిగితే, అతనికి జ్ఞానం పెరుగుతుంది. విమర్శనాత్మక ఆలోచన యువతకు భవిష్యత్తును నిర్మించే శక్తి. ఎందుకంటే భవిష్యత్తు నిజం మీదే నిలబడుతుంది. అసత్యం తాత్కాలికం; నిజం శాశ్వతం. అసత్యం మనసును కదిలిస్తుంది; నిజం మనసును నిలబెడుతుంది. విమర్శనాత్మక ఆలోచన ఈ రెండింటిని వేరు చేస్తుంది. ఒక విద్యార్థి విమర్శనాత్మక ఆలోచనను ఉపయోగిస్తే, అతని భవిష్యత్తు స్పష్టంగా ఉంటుంది. ఒక యువతి విమర్శనాత్మక ఆలోచనను ఉపయోగిస్తే, ఆమె నిర్ణయాలు బలంగా ఉంటాయి. ఒక యువకుడు విమర్శనాత్మక ఆలోచనను ఉపయోగిస్తే, అతని జీవితం వెలుగుతో నిండిపోతుంది. చివరగా, అసత్యాల అల్లకల్లోలంలో విమర్శనాత్మక ఆలోచన అనేది మనసును కాపాడే శక్తి. అది మనసును నిజం వైపు నడిపిస్తుంది. అది మనసును స్థిరంగా ఉంచుతుంది. అది మనసును వెలిగిస్తుంది. “విమర్శనాత్మక ఆలోచన అంటే అనుమానం కాదు; అది నిజాన్ని వెతికే ధైర్యం” అనే మాట యువతకు మార్గదర్శకం. అసత్యం ఎంత పెద్దదైనా, విమర్శనాత్మక ఆలోచన ఉన్న మనసు దానిని గుర్తిస్తుంది. నిజం ఎంత చిన్నదైనా, విమర్శనాత్మక ఆలోచన ఉన్న మనసు దానిని నిలబెడుతుంది. అసత్యాల అల్లకల్లోలంలో నిలబడేది జ్ఞానం కాదు; జ్ఞానాన్ని ఉపయోగించే విమర్శనాత్మక ఆలోచనే.

వచ్చే వారం : విద్యార్థుల్లో నాయకత్వం: బాధ్యతను నేర్పే మార్గదర్శక శక్తి

E-mail: reddyu@gmail.com

రామాయణం..
మానవాళికి మార్గదర్శకం

వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

రామాయణం మహా కావ్యమని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నీతి, ధర్మం, సత్యం, కరుణ వంటి ఉన్నతమైన విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహా ఇతిహాసమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కీర్తించారు. అంతటి మహాకావ్యాన్ని లోకానికి అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి మానవాళకి ఆదర్శప్రాయులన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఈనెల 26న నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రామాయణం మానవ జీవితానికి మార్గదర్శకంగా నిలిచే ధర్మబోధనల సమాహారమనిచెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది నియామకం

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది కేటాయింపు కోసం ఇటీవల కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సాఫ్ట్‌వేర్ ద్వారా చేపట్టిన ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు. జిల్లాలోని ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు రూరల్, నెల్లూరు అర్బన్ ప్రాంతాల్లో మొత్తం 594 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది అవసరాలను గుర్తించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీఓ), ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ (ఏపీఓ), ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓలు) చొప్పున మొత్తం నలుగురు సిబ్బందిని కేటాయించేలా ఏర్పాట్లు చేశారు. ఆ మేరకు మొత్తం 594 మంది పీఓలు, 594 మంది ఏపీఓలు, 2,376 మంది ఓపీఓలు కలిపి 3,564 మంది సిబ్బంది అవసరం కాగా, 20 శాతం రిజర్వు సిబ్బందితో కలిపి మొత్తం 4,277 మందిని కేటాయించేలా ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఇందులో 713 మంది పీఓలు, 713 మంది ఏపీఓలు, 2,851 మంది ఓపీఓలు ఉన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా, ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పోలింగ్ సిబ్బంది కేటాయింపు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ వారికి సూచించారు.

వైసీపీదంతా దుష్ప్రచారం..వాటిని నమ్మకండి!

జనసేనకి ఓట్లేయొద్దని నారాయణ చెప్పలేదు - జనసేన నాయకురాళ్ళ స్పష్టీకరణ

కూటమి మధ్య చిచ్చుపెట్టేందుకు వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నదని, అసలు మంత్రి నారాయణ ఏనాడూ జనసేనకి ఓట్లేయొద్దని తమకు చెప్పలేదని జనసేన నాయకురాలు.. 21వ డివిజన్ జనసేన అభ్యర్థి గునుకుల విజయలక్ష్మి స్పష్టం చేశారు. 71వ డివిజన్ జనసేన అభ్యర్థి అలియాతో కలసి ఆమె ఇటీవల ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి పొత్తులో బాగంగా జనసేన తరపున ముగ్గురు మహిళలకు కార్పొరేటర్లుగా పోటీచేసే అవకాశం ఇచ్చారని, మంత్రి నారాయణతో పాటు టీడీపీ క్యాడర్ తమకు అండగా ఉందని చెప్పారు. జనసేన, బీజేపీ, టీడీపీ మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవన్నారు. మంత్రి నారాయణ సతీమణి రమాదేవి, కుమార్తెలు సింధూర, షరణిలు కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అలుపెరగని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కొంతమంది కావాలనే పనిగట్టుకుని మరీ

మంత్రి నారాయణ మీద దుష్ప్రచారాలు చేయడం దారుణమని, అలాంటి అసత్యప్రచారాలను ఎవరూ నమ్మవద్దని వారు కోరారు. 15వ డివిజన్ జనసేన అభ్యర్థి కేజియాకుమారి మాట్లాడుతూ, నెల్లూరులో మంత్రి నారాయణ చేసిన అభివృద్ధి వల్లే మాకు ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, మంత్రి నారాయణ సహకారంతో తాము చేసే ప్రచారాలకు మంచి స్పందన వస్తోందన్నారు.

దర్భా భాస్కరమ్మ
శతజయంతి

సత్కారాన్నందుకుంటున్న హైమావతి

ప్రముఖ రచయిత్రి దర్భా భాస్కరమ్మ శత జయంతి వేడుక ఇటీవల టౌన్‌హాల్ రీడింగ్ రూమ్‌లో జరిగింది. వారి కుమార్తె ప్రముఖ రచయిత్రి, క్రీడాకారిణి డా. లక్ష్మీ సుహాసిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాస్కరమ్మ సాహితీ ప్రతిభను వక్తలు కొనియాడారు. ప్రముఖ సారస్వతవేత్త మందవరపు హైమవతి (విజయవాడ), గంగిశెట్టి శివకుమార్, పాతూరి అన్నపూర్ణ, గోవిందరాజు సుభద్రా దేవి. డా. కరుణశ్రీ, చేజెర్ల వినయ, పద్మ ప్రియ, పార్లపల్లి నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికే సాహిత్యం

సాహిత్యం సమాజ చైతన్యానికి ఎంతగానో దోహదం చేస్తుందని ప్రముఖ సాహితీవేత్త తిరుపతి ప్రాచ్య పరిశోధన కళాశాల ప్రొ.పీసీ వెంకటేశ్వర్లు చెప్పారు. ఈనెల 25న నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం

పీసీ వెంకటేశ్వర్లు దంపతులని సత్కరిస్తున్న పెరసం సభ్యులు

(పెరసం) ఆధ్వర్యంలో స్థానిక టౌన్‌హాలు ఏసీ రూమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, పెరసం పురస్కారాన్ని ప్రముఖ కవి బిల్ల మహేందర్‌కు అందజేశారు. మహేందర్ రచించిన ‘నేను మరణిస్తూనే ఉన్నాను’ కవితాసంపుటికి నగదు బహుమతితో పాటు పెరసం అవార్డు లభించడంతో వక్తలు ఆయన్ను అభినందించి సన్మానించారు. పెరసం అధ్యక్షుడు అవ్వారు శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి, వ్యవస్థాపక అధ్యక్షుడు మోపూర్ పెంచల నరసింహం, ప్రముఖ కవులు, రచయితలు గంగిశెట్టి శివకుమార్, చిన్ని నారాయణరావు, కొల్లూరు శ్రీనివాసులు, తోట సులోచన, అన్నం శివకృష్ణ, కె.అంకబాబు, పార్లపల్లి నాగేశ్వరమ్మ, మునీంద్రా, నరేంద్ర, మాధవ్, సుధా, కె.అంకబాబు, ఇంద్రగంటి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఆశీర్వదించండి

రోడ్‌షోలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు మునిసిపల్ ఎన్నికల్లో పోటీచేస్తున్న వైసీపీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని వైసీపీ నేత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల నగరంలోని పప్పులవీధిలో ముమ్మరంగా వైసీపీ నేతలు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో పర్వతరెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు నగర కార్పొరేషన్‌లో కూటమి ప్రభుత్వం అరాచక విధానాలను సాగిస్తోందని మండిపడ్డారు. నవంబర్ 1న జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీకి విజయం చేకూర్చాలని, తద్వారా అభివృద్ధికి పట్టం కట్టాలని అన్నారు. మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, 11వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థిని నల్లూరి సౌజన్య, 12వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి పెల్లూరు శ్రీనివాసులు, 10వ డివిజన్‌లో వైసీపీ బలపరిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి పైడిమాని సుజనలతో కలిసి వారు ఎన్నికల ప్రచారం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించాలనే ఉద్దేశంతో..వైసిపి అభ్యర్థులపై అక్రమ కేసులు, తప్పుడు విధానాలతో.. కూటమి ప్రభుత్వం దుర్మార్గాలు సాగించిందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మళ్లీ అవకాశం కల్పిస్తే.. నగరంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ఆయన వివరించారు.

భక్తిశ్రద్ధలతో

కాత్యాయని వ్రతం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 27న కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ సుందరేశ్వర స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలను వైభవంగా నిర్వహించారు. అనివెట్టి మండపంలో రాజరాజేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు కాత్యాయని అలంకారాన్ని శోభాయమానంగా నిర్వహించి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన కాత్యాయని వ్రతంలోనూ అనేకమంది పాల్గొన్నారు. ఆలయ ఛైర్‌పర్సన్ ఏలూరు శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సహాయ కమిషనర్ నూతలపాటి శ్రీధర్‌నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

పార్టీశ్రేణులకి రామ్‌కుమార్ పిలుపు

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీచేస్తున్న అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకి సూచించారు. వెంకటగిరిలో ఇటీవల ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను సమావేశపరచి వారికి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి నేతల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లకు భయపడకుండా, ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ఓటమి భయంతోనే కూటమి నేతలు దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రజలకు వివరించాలని ఆయన చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వార్డుల పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అక్రమ కేసులు, దాడులు, ఇతర అవరోధాల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పార్టీ అభ్యర్థులకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారితో నిరంతరం మమేకమై ఎన్నికల ప్రచారాన్ని సాగించాలని ఆయన సూచించారు.

గూడూరు డివిజన్

అమరవీరుల స్మృతిగా క్యాండిల్ ర్యాలీ

విద్యార్థినులతో కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని బాలాజీనగర్ సెంటర్ నుండి టవర్‌క్లాక్ వరకు డీఎస్పీ నర్సింహమూర్తి, సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది విద్యార్థినిలతో కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేశారు. డి.ఎస్.పి నరసింహమూర్తి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు ప్రశాంతంగా జీవించడానికి పోలీసు, జవాన్లు నిరంతరం విధులు నిర్వహిస్తుంటారని, ఇలా విధి నిర్వహణలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు.

గోదాముల్లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీ

స్థానిక ఎన్నికల నేపథ్యంలో.. గూడూరు పరిధిలోని గోదాములు, అనుమానాస్పద ప్రాంతాల్లో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్రమ మద్యం నిల్వలు, అనధికార మద్యం విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. అక్రమ మద్యం కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అక్రమ మద్యం కార్యకలాపాలు గుర్తించినట్లయితే సంబంధిత ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

హుండి లెక్కింపుకి హాజరైన ఛైర్మన్ శ్రీకంటి, కమిటీ సభ్యులు

శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని హుండీ లెక్కింపు

గూడూరు, రాజావీధిలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆరు నెలలకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలు 2లక్షల 39వేల రూపాయలు వచ్చాయని ఆలయ ఛైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమం ఇ.ఓ చిట్టిబాబు, కమిటీ సభ్యులు అమరయ్యనాయుడు, గోపాల్, రవీంద్రబాబు, నాగేంద్రబాబు, ఆలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, అర్చకులు భార్గవస్వామి సమక్షంలో జరిగిందని తెలిపారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ సేవా కార్యక్రమాలు

విద్యార్థినులకి హైజీన్ కిట్స్ పంపిణీ చేస్తున్న మంజుల

ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ గూడూరు, డిస్ట్రిక్ట్ 316 ఛైర్మన్ మంజుల అధికారిక పర్యటనలో భాగంగా గూడూరులో ఇటీవల పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా జానకి రాంపేటలోని ఎస్టీ గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకి క్లబ్ అధ్యక్షురాలు కె.నిర్మల మాన్‌కైండ్ కంపెనీ సహకారంతో హైజీన్ కిట్లను అందజేశారు. అలాగే సభ్యురాలు ఎస్.శ్రీలక్ష్మి శానిటరీ న్యాప్కిన్ డిస్పోజల్ మిషన్‌ని అందజేశారు. ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షులు డాక్టర్ సి.రోహిణి, కార్యదర్శి విష్ణువందన ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పేదలకి సిఆర్ రెడ్డి ఆసరా

పేదలకు ఫలసరుకులు పంపిణీ చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

రెడ్డిజన బంధువులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి. రోహిణిల సౌజన్యంతో నెల నెలా నిర్వహించే 'డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆసరా' కార్యక్రమం ఈ నెల 25వ తేదీ గూడూరులోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో జరిగింది. ఈ సందర్భంగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, బండి ధనుంజయరెడ్డి 20మంది పేద రెడ్డి కుటుంబాలకి ఫల సరుకులు పంపిణీ చేశారు. బి.దశరథరామిరెడ్డి, కె.జనార్ధన్‌రెడ్డి, ఎన్.సిద్ధారెడ్డి, ఎం.జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు జేవీవీ కూరగాయలు

దివ్యాంగులకి కూరగాయలు, గుడ్లు అందజేస్తున్న బాలకృష్ణరాజు

గూడూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఇటీవల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విఎస్ఆర్ పాఠశాల కరస్పాండెంట్ నందిమండలం బాలకృష్ణరాజు దాతృత్వంతో వారి చేతులమీదుగా దివ్యాంగులకి కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. చెంచు నారాయణ, రాజేంద్రప్రసాద్, నాగరాజు, రామమోహన్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి పల్లకి సేవ

గూడూరు మండలం కుందకూరు సమీపంలోని కనుమరాయ కొండపై వెలసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మాసోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి వారికి విశేష అలంకరణ ఏర్పాటు చేసి మంగళ వాద్యాలతో పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు.

పోలీసుల ఆధ్వర్యంలో..రక్తదాన శిబిరం

రక్తదానం చేసిన పోలీసులని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల ఆధ్వర్యంలో ఈనెల 28న పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సహకారంతో నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బందితో పాటు ఆటోడ్రైవర్లు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సుమారు 700 యూనిట్ల రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు, బాధితులకు రక్తం ఎంతో అవసరమని, రక్తదానం చేయడమంటే రోగులకు ప్రాణదానం చేయడమేనని జిల్లా ఎస్పీ అజిత చెప్పారు. అనంతరం, పోలీసు సిబ్బందికి, వారి కుటుంబసభ్యులకు ఆరోగ్య పరిరక్షణ కోసం కేఐఎంఎస్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేసి ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత పోలీసుల ఆధ్వర్యంలో 10 కిలోమీటర్ల మారథాన్ రన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా చేపట్టారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయసాధనకు అంకిత భావంతో పోలీసులందరూ పనిచేయాలన్నారు. త్యాగమే స్ఫూర్తిగా తీసుకుని సమాజసేవా భావంతో పోలీసులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా పోలీసులు, రెడ్‌క్రాస్, ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించిన..కమిషనర్

స్థానిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఈనెల 28న నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి వైఓ నందన్ సందర్శించారు. సాధారణ ఎన్నికల విధుల్లో ఉన్న నగరపాలక సంస్థ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏర్పాటుచేసిన బ్యాలెట్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సిబ్బంది, అధికారులు తమ ఓటుహక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఓటరు స్లిప్పులు ఇస్తున్నాం..

నెల్లూరు నగర కార్పొరేషన్‌కి సంబంధించి నవంబరు1న జరిగే ఎన్నికలకు ఓటర్ల స్లిప్‌లను బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారని నందన్ తెలిపారు. సంబంధిత అధికారులు మీ ఇళ్లవద్దకు వచ్చినప్పుడు నగర ప్రజలు తమ ఓటరు వివరాలతో కూడిన స్లిప్‌లను తీసుకుని, నవంబరు 1వతేదీన జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో పాల్గొని, ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

వృద్ధాప్యం.. నేరమా?

సీనియర్ సిటిజన్ల సంక్షేమంపై ప్రభుత్వాలు ఆలోచించాలి

నిన్నటి దేశ నిర్మాణంలో భాగస్వాములు.. నేడు ప్రభుత్వ విధానాల్లో అట్టడుగునా?

వృద్ధాప్యం అన్నది జీవితంలో సహజమైన దశ. కానీ ఆ దశలోకి అడుగుపెట్టిన తర్వాత ఒక పౌరుడు తనకున్న గౌరవం, ఆర్థిక భద్రత, ఆరోగ్య రక్షణ, సామాజిక భరోసా కోసం పోరాడాల్సి వస్తే అది కేవలం వ్యక్తిగత సమస్య కాదు. ఒక సమాజం తన వృద్ధులను ఎలా చూసుకుంటుందన్నది ఆ సమాజం మానవీయతకు కొలమానం. సీనియర్ సిటిజన్ల సమస్యలపై రాజ్యసభలో ఎంపీ సంజయ్‌రౌత్ అయిదేళ్ల క్రితమే కొన్ని ప్రశ్నలు లేవనెత్తారు. అప్పట్లో ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానమిస్తూ సీనియర్ సిటిజన్ల కోసం నేషనల్ యాక్షన్ ప్లాన్, ఆర్థిక భద్రత, ఆరోగ్యం, ఆహారం, రక్షణ, గౌరవప్రద జీవనం వంటి అంశాలపై పలు కార్యక్రమాలు అమలులో ఉన్నాయని వెల్లడించింది. అయితే నేడు చర్చించాల్సిన అసలు ప్రశ్న అమలులో ఉన్న పథకాలు సరిపోతున్నాయా? వృద్ధుల జీవితాలకి అవి నిజమైన భద్రతను కల్పిస్తున్నాయా? అన్నదే.



వైద్య ఖర్చులే పెను సవాలు!

వృద్ధాప్యంలో అత్యంత పెద్ద సమస్య వైద్య ఖర్చులు. సీనియర్ సిటిజన్లకు 70 ఏళ్ల తర్వాత ఆరోగ్య బీమా పూర్తిగా అందదనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, అది సాధారణ నియమం కాదు. ఐఆర్డిఏ ప్రకారం ఆరోగ్యబీమా పాలసీలకు కనీస ప్రవేశ వయస్సు సాధారణంగా 65సంవత్సరాల వరకు ఉండాలి. అంతకంటే ఎక్కువ వయస్సులో ఉన్నవారికే కల్పించే పాలసీలు కూడా ఉన్నాయి. ఒకసారి పాలసీ జారీ చేసి నిరంతరంగా పునరుద్ధరిస్తూ ఉంటే, కేవలం వయస్సు కారణంగా పునరుద్ధరణను నిరాకరించకూడదని కూడా నిబంధనలు చెప్తున్నాయి. అయితే వాస్తవ సమస్య వేరే ఉంది. వయస్సు పెరిగే కొద్దీ ప్రీమియం భారం, ముందుగా ఉన్న అనారోగ్యాలు, చికిత్స ఖర్చులు పెరుగుతాయి. 2025లో సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా ప్రీమియం రేట్లపై సమీక్షకు ఐఆర్డిఏ ప్రత్యేకంగా చర్యలు చేపట్టడం కూడా ఈ సమస్య తీవ్రతను సూచిస్తోంది. అందువల్ల వృద్ధులకు బీమా అందుతుందా లేదా అన్నదానికంటే అది వారికి భరించగల స్థాయిలో అందుబాటులో ఉందా? అన్నదే ముఖ్యమైన ప్రశ్న.

రైల్వే రాయితీ మరో ప్రశ్న!

సీనియర్ సిటిజన్లకు రైల్వే ప్రయాణ రాయితీ ఒకప్పుడు ముఖ్యమైన సామాజిక భద్రతా సదుపాయంగా ఉండేది. కోవిడ్ సమయంలో, 2020 మార్చి 20 నుంచి ఈ రాయితీని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. కోవిడ్ పరిస్థితులు మారిన తర్వాత కూడా ఆ రాయితీ పునరుద్ధరణ జరగకపోవడం చాలాకాలంగా చర్చకు కారణమై, వృద్ధుల నుండి వృద్ధ సంఘాల నుండి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అయితే 2018–19లోనే సీనియర్ సిటిజన్ల రాయితీల వల్ల రైల్వే శాఖ సుమారు రూ.1,635 కోట్ల ఆదాయాన్ని వదులుకోవాల్సి వచ్చిందని అప్పటి అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. ఇక్కడ అసలు ప్రశ్న ప్రభుత్వ ఆర్థిక భారంపై మాత్రమే కాదు. సామాజిక భద్రతకు ప్రభుత్వం ఎంత విలువ ఇస్తోంది? అన్నది కూడా చర్చించాల్సిన అంశమే.

అందరికీ పింఛన్ సాధ్యమేనా?

60 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడికి ప్రభుత్వ పింఛన్ ఇవ్వాలన్న డిమాండ్ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ దేశవ్యాప్తంగా ఉన్న వృద్ధులందరికీ సార్వత్రిక పింఛన్ ఇవ్వాలంటే భారీ ఆర్థిక వనరులు అవసరం. అందుకే పింఛన్ విధానంలో ఆదాయ స్థాయి, ఆస్తులు, ఆరోగ్య పరిస్థితి, కుటుంబ ఆధారితత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలా? లేక వయస్సే అర్హతకు ప్రధాన ప్రమాణంగా ఉండాలా? అనే చర్చ కూడా చాలా అవసరం. ప్రస్తుతం కేంద్రం సీనియర్ సిటిజన్ల కోసం వివిధ పథకాలను అమలు చేస్తోంది. 75 ఏళ్లు పైబడిన, కేవలం పెన్షన్ మరియు వడ్డీ ఆదాయం ఉన్న కొన్ని వర్గాల వారికి ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు విషయంలో కూడా ప్రత్యేక సౌలభ్యం కల్పించింది. అయితే పథకం ఉండటం ఒక విషయం ఆ పథకం అర్హుడైన ప్రతి వృద్ధుడి ఇంటి గడపకు చేరడం మరో విషయం.

పనిచేయాలనుకునే వృద్ధులకు అవకాశాలెక్కడ?

60 లేదా 65 ఏళ్లు దాటిన ప్రతి వ్యక్తి పని చేయలేని స్థితిలో ఉంటారని భావించడం కూడా సరైంది కాదు. వైద్యులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, కళాకారులు, రైతులు, వ్యాపారవేత్తలతో పాటు అనేక రంగాల్లో దశాబ్దాల పరిపాలనా అనుభవం కలిగినవారు వృద్ధాప్యంలోకి వస్తారు. వారిని కేవలం 'పెన్షన్ పొందేవారు'గా కాకుండా అనుభవ సంపదగా చూడాల్సిన అవసరం కూడా చాలా ఉంది. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, కన్సల్టెన్సీ, ఇంటి నుంచే చేసే పనులు, యువతకు మెంటారింగ్, నైపుణ్య బోధన వంటి అవకాశాలను ప్రభుత్వం, ప్రైవేటు రంగం కలిసి అభివృద్ధి చేస్తే వృద్ధులు కుటుంబానికి, సమాజానికి భారంగా కాకుండా మరోసారి క్రియాశీల భాగస్వాములుగా మారడానికి మార్గం సుగమమవుతుంది.

చట్టం ముందు సమానత్వం, జీవితంలోనూ గౌరవం!

సీనియర్ సిటిజన్ల కోర్టు కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న డిమాండ్ కూడా పరిశీలనకు అర్హమైనదే. వయస్సు మీదపడిన వ్యక్తి దశాబ్దాల పాటు ఒక కేసు పరిష్కారం కోసం ఎదురుచూడాల్సి వస్తే, న్యాయం ఆలస్యం కావడం వారికి మరింత తీవ్రమైన సమస్యగా మారుతుంది. వారికి న్యాయం జరిగి వారి కేసు కొలిక్కి వచ్చేలోగా చాలామంది కాటికి పోయే పరిస్థితులు ఉండడం అత్యంత బాధాకరం. అదే విధంగా ప్రతి నగరంలో సీనియర్ సిటిజన్ల కోసం సౌకర్యాలతో కూడిన నివాసాలు, ఆరోగ్య కేంద్రాలు, డే-కేర్ కేంద్రాలు, రవాణా సదుపాయాలు, అత్యవసర సహాయక వ్యవస్థలు వంటి మౌలిక వసతులపై కూడా ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అంశం!

సీనియర్ సిటిజన్లు ఒక పెద్ద ఓటు బ్యాంకు. కానీ వారిని కేవలం ఎన్నికల సమయంలో గుర్తు చేసుకోవడం సమస్యకు పరిష్కారం కాదు. వారు ఈ దేశ ఆర్థిక వ్యవస్థకు పన్నులు చెల్లించారు, సంస్థలను నిర్మించారు, కుటుంబాలను పోషించారు, తదుపరి తరాలను తీర్చిదిద్దారు. అందుకే సీనియర్ సిటిజన్ల సంక్షేమం ఏ పార్టీకి అనుకూలం, ఏ పార్టీకి వ్యతిరేకం అనే రాజకీయ అంశంగా కాకుండా తరాల మధ్య సామాజిక ఒప్పందంగా చూడాలి.

వృద్ధాప్యం శిక్ష కాదు.. జీవితానుభవానికి గౌరవం

“65 ఏళ్లు దాటిన తర్వాత ప్రభుత్వం వృద్ధులను పట్టించుకోవడం లేదంటే వారిని చంపేయాలా?” అనే తీవ్ర వ్యంగ్యభరితమైన వాక్యంతో సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న సందేశం అసలు ఉద్దేశం ఒకటే. అది దేశ నిర్మాణంలో భాగస్వాములైన వృద్ధులను విస్మరించవద్దన్న హెచ్చరిక. అయితే ఇలాంటి వైరల్ సందేశాలను పంచుకునే ముందు వాటి అసలు మూలాన్ని పరిశీలించడం కూడా అంతే ముఖ్యం. అందుకే చర్చ వ్యక్తులపై కాకుండా విధానాలపై జరగాలి. వృద్ధాప్యం నేరం కాదు. పెన్షన్ అడగడం దానం అడగడం కాదు. ఆరోగ్య భద్రత కోరడం ప్రత్యేక హక్కు కాదు. గౌరవప్రదమైన జీవితం కోరడం ప్రతి పౌరుడి కనీస హక్కు. దేశం అభివృద్ధి చెందుతున్న కొద్దీ దాని వృద్ధుల భద్రత కూడా పెరగాలి. నిన్న దేశాన్ని నిర్మించిన చేతులు రేపు మన చేతలపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు, వారిని ఎలా చూసుకుంటామన్నదే మన సామాజిక ప్రగతికి అసలైన పరీక్ష.!

'అడ్డంకులు సృష్టించడమేనా.. ప్రజాస్వామ్యం?

• కూటమి నేతలకు రామ్‌కుమార్ సూటిప్రశ్న

ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డంకులు సృష్టించడమేనా మీ ప్రజాస్వామ్యం?.. అంటూ వెంకటగిరి వైసీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కూటమి నేతలను సూటిగా ప్రశ్నించారు. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద శివాలయం వీధి వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ బులిగండ్ల దీవెనతో కలిసి ఆయన ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించే దమ్ము, ధైర్యం టీడీపీ కూటమి ప్రభుత్వానికి లేవని, వైఎస్సార్‌సీపీ నాయకులను నామినేషన్ల విషయంలో ఇబ్బందులకు గురిచేయడం, నామినేషన్ పత్రాలను చించివేయడం, భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. టీడీపీ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే రాజకీయంగా ప్రజాక్షేత్రంలో పోరాడాలని, ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించి ప్రజల నిర్ణయాన్ని గౌరవించాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని పేర్కొన్నారు.

అలవికాని చోట అధికులమనరాదు

(మొదటిపేజీ తరువాయి)

తీరా అధికారులు వాటిని తిరస్కరించిన తరువాత ఇదంతా కూటమి కుట్ర అంటూ అదే నాయకులు హాహాకారాలు చేసి అటు జగన్‌ని ఇటు జనాన్ని తెలివిగా బురిడీ కొట్టించేసి చేతులు దులుపుకున్నారనే ఊహాగానాలు సర్వత్రా జోరందుకుంటున్నాయి.

ప్రతిదానికీ రైట్ అంటే.. ఫైట్ రాదని లేటెస్ట్ సామెత. అది కాపురానికైనా.. రాజకీయాలకైనా సరిపోతుంది. చాణుక్యుడు అర్ధశాస్త్రంలో చెప్పినట్లు నాయకుడు ఎప్పుడూ ప్రజలకు దూరం కాకుండా, వారిని నిత్యం తన చెప్పుచేతల్లో పెట్టుకుని ముందు కెళ్లాలి.. అప్పుడే అతడి ప్రభ అప్రతిహతంగా సాగిపోతుంది. ఇదే తరహాలో గత ఎన్నికల్లో చావుదెబ్బతిని 151 నుంచి 11కి పడిపోయిన వైఎస్సార్‌సీపీని ఎలాగైనా ఈసారి కూటమి ధీటుగా పోటీలో నిలపాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ భావించారు. ఇందులో భాగంగానే నిస్తేజంగా మారిన పార్టీ శ్రేణుల్లో మళ్లీ జవసత్వాలు నింపడమే ధ్యేయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నీ స్థానాల్లోనూ అభ్యర్థులు బరిలో ఉండాలని పార్టీ కేడర్‌కు పలు దఫాలు ప్రత్యేక సమావేశాలు పెట్టి మరీ దిశానిర్దేశం చేశారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే సదరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తకు వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం దక్కదంటూ ఖరాకండిగా చెప్పేశారు. దీంతో ఏం చేయాలో పాలుపోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమనయకర్తలు తమ గ్రామ, వార్డు, మండల స్థాయి నాయకులతో కలిసి వినూత్న మాస్టర్‌ప్లాన్ వేసినట్లు రాజకీయవర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ స్ట్రాటజీలో భాగంగా అధినేత జగన్ ఆగ్రహానికి గురికాకుండా ఉండే లక్ష్యంతో తొలుత నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అటు మున్సిపాలిటీలకు, ఇటు మండల పరిషత్, జిల్లా పరిషత్ సహా పంచాయతీ ఎన్నికల్లో తమతమ పరిధిలో నామినేష్లను దాఖలు చేయడం. తద్వారా తమ నియోజకవర్గంలో అన్ని చోట్లా బరిలో ఉన్నామని బిల్డప్ ఇవ్వడం. ఆ తర్వాత కూటమి పార్టీల నాయకులు కుట్రలు పన్ని తమ నామినేషన్లను రిజక్ట్ చేశారంటూ ఆరోపిస్తూ ధర్నాలు, నిరసనలు చేపట్టడం చకచకా జరిగిపోయేలా వ్యూహం రచించుకున్నట్లు సమాచారం. కాకపోతే అసలు మతలబు ఇక్కడే ఉందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. దాఖలు చేసే సమయంలోనే నామినేషన్లు తామే తప్పులు తడకగా ఆర్ఓలకు అందజేసి, ఆ తర్వాత తిరస్కరించారంటూ ఆరోపిస్తూ తమ అనుచరులతో తామే శాపనార్థాలు పెట్టించడం వైఎస్సార్‌సీపీ నాయకులకే చెల్లిందని, ఔరా అంటూ విశ్లేషకులు నోళ్లెళ్లబెడుతున్నారు.

మరేం చేయమంటారు..?

నిండా దెబ్బతిని ఉన్నాం!

ఓ రాయలసీమ నేత స్థానిక ఎన్నికల్లో పోటీపై మాట్లాడుతూ నర్మగర్భంగా చేసిన కీలక వ్యాఖ్యలు కూడా పొలిటికల్ సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారినట్లు తెలిసింది. 2019 ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం వైఎస్సార్‌సీపీ అధిష్టానం కార్యకర్తలను పట్టించుకోవడం మానేసిందని, దీంతో పార్టీ అధికారంలో ఉన్నా వారు ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయారని ఆయన వాపోయారు. 2019-2024 మధ్య కాలంలో జగన్, ఆయన కోటరీ మాత్రమే బాగు పడ్డారని ఫలితంగా పార్టీ అధికారంలో ఉన్నా తాము ఉత్సవ విగ్రహాల్లా ఎందుకూ కాకుండా మిగిలిపోయామని కూడా తన ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు 2024 ఎన్నికల్లో బరిలోకి దిగడం ద్వారా ఉన్న డబ్బును కూడా ఖర్చు చేసి రెంటికీ చెడ్డ రేవడిగా మారామని, ఫలితంగా ప్రస్తుతం దివాలా తీసే స్థితి చేరామని బాధపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ వేలు లక్షల రూపాయలు ఖర్చు చేసి స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడమంటే తమ శక్తికి మించిన పనిగానే భావించాల్సి ఉంటుందన్నారు. అధినేత జగన్ ఈ విషయాన్ని గుర్తించకుండా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే, అనుచరులను బరిలోకి దింపాల్సిందే అంటూ తమ మెడపై కత్తి పెట్టడం వల్లే తాము నామినేషన్ల సమయంలోనే తెలిసి తప్పులు చేసి అవి తిరస్కరించబడేలా పథకం పన్నామని స్పష్టం చేసాడు. దీనికి మించిన ప్రత్యామ్నాయం తమకు కనిపించడం లేదని అందుకే తప్పే అయినా తప్పడం లేదంటూ అయన కుండబద్దలు కొట్టడం గమనార్హం.

డైరక్షన్ సజ్జలేనా..?

కాగా స్థానిక సమరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనుసరిస్తున్న ఈ కొత్త వ్యూహం జగన్ కోటరీలో ప్రధానపాత్ర పోషిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డికి తెలిసే జరుగోతందనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. ఏవిషయాన్నైనా ఎంతవరకు జగన్ దగ్గరికి తీసుకెళ్లాలి, ఏఏ విషయాలను ఎప్పుడు చెప్పాలో నిర్ణయించే ప్రధాన పవర్‌పాయింట్ సజ్జలే. కొందరు నాయకులు సజ్జల వద్ద నామినేషన్లలో గోల్‌మాల్ గోవిందం వ్యవహారాన్ని ముందస్తుగానే తెలియజేశారని, తొలుత ఏం చేయాలో పాలుపోని సజ్జల తర్వాత ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తంతును జరిపి స్థానిక ఎన్నికలపై మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో ఎంతమాత్రం నిజముందో దేవుడికే తెలియాలి.

దాదాపుగా కూటమి క్లీన్‌స్వీప్!

తమ పార్టీ అధిష్టానం ఒత్తిడి తట్టుకోలేక నామినేష్లను దాఖలు చేశామని చెబుతున్న వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, క్షేత్రస్థాయిలో పోటీలో నిలిచి విజయం సాధించడం అంత సులభం కాదన్నది బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో నవంబర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ, నవంబర్ 5న జరుగనున్న పరిషత్ పోరులోనూ కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులు భారీమెజారిటీలతో కార్పొరేషన్లు, పురపాలికలు, ప్రాదేశిక నియోజకవర్గాలైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను 90 శాతం మేర కైవసం చేసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 12కుపైగా మున్సిపాలిటీలు, నగర పంచాయతీలను ఏకగ్రీవంగా దక్కించుకున్న కూటమి నేతలు మిగిలిన చోట్ల సైతం జయకేతనం ఎగురవేయడం ఖాయమనే ప్రచారం జోరందుకుంది. మొత్తం 100 చోట్లకు గాను కనీసం 90 మున్సిపాలిటీలకు పైగా కూటమి ఖాతాలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 659 జెడ్పీటీసీ స్థానాల్లో ఇప్పడికే 72 ఏకగ్రీవం అయ్యాయి. అలాగే 9,829 ఎంపీటీసీ స్థానాల్లో 1985 ఏకగ్రీవమైనట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. ఇక 13,327 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాల్లో సైతం దాదాపు 85 శాతం మేరకు తెలుగుదేశం, జసనేన, భారతీయ జనతాపార్టీ దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఏదేమైనా పేరుకు పోటికీ సై అంటూనే ప్రత్యర్థికి విజయాన్ని నల్లేరుపై నడకలా చేస్తున్న వైఎస్సార్‌సీపీ కేడర్ వేసిన ఎత్తుగడ అదుర్స్ అనడంలో సందేహం లేదు. నాన్‌ప్లేయింగ్ కెప్టెన్ అన్నట్లుగా టీంలో ఉంటూనే ఆడకపోవడం అనే సరికొత్త విధానాన్ని రాజకీయాల్లో అమలు చేస్తూ స్వామికార్యం... స్వకార్యం రెండూ నెరవేర్చుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు తమ రూటే సపరేటని నిరూపించుకుంటున్నారబ్బా. వీళ్ళు సామాన్యులు కాదురా సామీ!

రమాదేవి రోడ్‌షోలకు..

విశేష స్పందన

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో కూటమి జోరు కొనసాగుతోంది. నగర నియోజకవర్గంలోని 19,20,21,22 డివిజన్లలో టీడీపీ అభ్యర్థులు కర్తం ప్రతాప్‌రెడ్డి, గణేశం వెంకటేశ్వర రెడ్డి, గునుకుల విజయలక్ష్మి, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్‌కు మద్దతుగా పురపాలక మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ఈనెల 28న నిర్వహించిన రోడ్‌షోలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం సహకారంతో మంత్రి నారాయణ చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమికి అండగా ఉంటామని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారని పేర్కొన్నారు. మంత్రి నారాయణపై ప్రజలు చూపిస్తున్న అభిమానం, ఆయన చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు కూటమి అభ్యర్థుల భారీ విజయానికి బాటలు వేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. నగరంలోని అన్ని డివిజన్లతో పాటు మేయర్ స్థానాన్ని కూడా కూటమి కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ అభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు అభివృద్ధిలో మంత్రి నారాయణ ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నెల్లూరును ఇంతగా అభివృద్ధి చేసిన మంత్రి లేరని, నగర అభివృద్ధిలో నారాయణ చరిత్ర పుటల్లో నిలిచిపోతారని పేర్కొన్నారు.

హరిత హోటల్‌లో పేకాట

➤ 8 మంది అరెస్ట్, 3 లక్షలా 53వేలు స్వాధీనం

నగరంలో పేకాటరాయుళ్ళు బరితెగించిపోతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని హోటళ్ళని కూడా వదలకుండా పేకాటకు రహస్య స్థావరాలుగా చేసుకుంటున్నారు. తాజాగా పోలీసుల తనిఖీల్లో ఇలాంటి విషయాలు బట్టబయలవుతున్నాయి. నెల్లూరు దర్గామిట్టలోని హరిత ఏపీ టూరిజం హోటల్‌లో ఇటీవల పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏఎస్పీ దీక్ష, దర్గామిట్ట సీఐ కల్యాణ్‌రాజుల ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి ఆ హోటల్‌లో పేకాటాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 3 లక్షలా 53వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిర్వాహకులతో పాటు మరికొంతమంది ప్రముఖులు కూడా పట్టుబడినవారిలో ఉన్నట్లు సమాచారం.

బ్రెయిన్ స్ట్రోక్‌తో జాగ్రత్త!

డాక్టర్ బిందుమీనన్

ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధపెట్టి, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి ప్రాణాంతక పరిణామాలకి గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరు అపోలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగ అధిపతి డాక్టర్ బిందుమీనన్ సూచించారు. స్ట్రోక్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నెల్లూరు అపోలో హాస్పిటల్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో సంభవించే పక్షవాతానికి సంబంధించి ప్రతీ నిముషం ఎంతో విలువైందని, ఎంతత్వరగా రోగిని వైద్యుని వద్దకు తీసుకువస్తే.. అంత వేగంగా పక్షవాతం నుండి బయటపడే అవకాశం ఉందన్నారు. ముందస్తు గుర్తింపు, వేగవంతంగా వైద్య సేవలు అందించడం, రోగికి మంచి ఆరోగ్యాన్ని అందించడం అనే ప్రక్రియలో అపోలో హాస్పిటల్ పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా అపోలో హాస్పిటల్ లో నిర్వహించిన ఈ సమావేశంలో డాక్టర్ బిందుమీనన్‌తో పాటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, అపోలో హాస్పిటల్ యూనిట్ హెడ్ విశ్వేశ్వర్ రెడ్డి, న్యూరాలజిస్టులు డాక్టర్ శివశంకర్, డాక్టర్ రష్మిరెడ్డి, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ వీ.శ్రీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బింధుమీనన్ అపోలో హాస్పిటల్‌లో సేవలు అందిస్తూనే నిరుపేదల కోసం డాక్టర్ బింధుమీనన్ ఫౌండేషన్‌ను స్థాపించి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని డాక్టర్ శ్రీరామ్ సతీష్ కొనియాడారు. అపోలో హాస్పిటల్ రేడియాలజిస్టులు డాక్టర్ గాయత్రి, ప్రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేస్తే.. జయం మనదే!

❍ కూటమి శ్రేణులకు మంత్రి ఆనం పిలుపు

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అందరూ కష్టపడి పనిచేయాలని, కలసికట్టుగా కృషిచేస్తే విజయం తథ్యమని మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పార్టీశ్రేణులకు సూచించారు. ఈనెల 29న ఆయన మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని కామాక్షి కళ్యాణ మండపం వద్ద నిర్వహించిన తెలుగుదేశం పార్టీ - ఎన్డీఏ కూటమి నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా పని చేయాలని కోరారు. ప్రజల మద్దతుతో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఎస్ పేట మండల పరిధిలోని ఎంపీటీసీ అభ్యర్థులు, టీడీపీ-ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామస్థాయి ముఖ్య నాయకులు, బూత్ కమిటీ ఇన్‌చార్జీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీపై.. టీడీపీ జెండా రెపరెపలు ఖాయం

❍ సోమిరెడ్డి జోస్యం

జిల్లా పరిషత్తు ఎన్నికల్లో కూటమి గెలవడం, నెల్లూరు జడ్పీ కార్యాలయంపై టీడీపీ జెండా ఎగరడం ఖాయమని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జడ్పీటీసీ అభ్యర్థులకు మంత్రి ఆనం రామనారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పరిశీలకులు దూండీ రాకేష్‌తో కలసి అభ్యర్థులకు బీఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జెడ్పీటీసీ స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులు భారీ విజయాలు సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

శ్రీవారి సేవలో అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి

తిరుమలేశుని ఆశీస్సులతోనే తాము అపోలో ఆసుపత్రులు ప్రారంభించామని ఆ ఆసుపత్రుల చైర్మెన్ ప్రతాప్ సి.రెడ్డి చెప్పారు. తన కుమార్తె ప్రీతారెడ్డి, మనవరాలు (హీరో రామ్‌చరణ్ సతీమణి) ఉపాసన తదితరులతో కలిసి ఆయన బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు.

ప్రచారంలో ప్రశాంతమ్మ

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ గ్రామగ్రామాన ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నెల 29వ తేదీ విడవలూరు మండలంలోని రామతీర్థం, రామచంద్రాపురం, పెద్దపాళెం, గాదెలదిన్నె, వావిళ్ల, దంపూరు, చౌకచర్ల గ్రామాల్లో ప్రశాంతిరెడ్డి పర్యటించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలంటే స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

రైతుబజార్లలో తక్కువ ధరకు బియ్యం

బియ్యం బస్తాలను పంపిణీ చేస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

మార్కెట్లో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని రైతు బజార్లలో ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో బియ్యం విక్రయిస్తు న్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ నెల 28న ఆయన నెల్లూరులోని ఫతేఖాన్‌పేట రైతుబజారును సంద ర్శించి ప్రజలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, నెల్లూరులోని ఫతేఖాన్‌పేట, నవాబుపేట రైతుబజార్లతో పాటు, గూడూరు, పొదలకూరు, కావలి రైతుబజార్లలో కూడా మార్కెట్‌ధరల కంటే తక్కువ ధరకు బియ్యం విక్రయిస్తున్నట్లు తెలిపారు. బీపీటీ రకం బియ్యం కిలో 49 రూపాయలకు, కేఎన్ఎం రకం బియ్యం కిలో 50 రూపాయలే విక్రయిస్తున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాల

డైరెక్టర్‌గా..డా.శైలజ

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) ఫార్మసీ కళాశాల డైరెక్టర్‌గా డా.శైలజ నియమితు లయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాసరావు ఆమేరకు ఆమెకు ఈనెల 28న నియమాక పత్రం అందజేశారు. డా.శైలజ జంతుశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. విద్య, పరిశోధన రంగాలలో అమెక విశేషమైన అనుభవం ఉంది. ఔషధ భద్రత, ప్రజల ఆరోగ్యాభి వృద్ధికి దోహదపడే కార్యక్రమాల ద్వారా ఫార్మసీ విద్యాసంస్థను మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్లేందుకు తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా డా.శైలజ చెప్పారు. తనను డైరెక్టరుగా నియమించినందుకు విఎస్‌యు ఉపకులపతి ప్రొ. అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ కె.సునీతకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి

ఫ్లాగ్‌మార్చ్‌లో పోలీసులు

ఫ్లాగ్‌మార్చ్‌లో ప్రజలకి అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ దీక్ష

ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోలీసులు ప్రజలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈనెల 28న నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ఓటుహక్కుపై అవగాహన కలిగించారు. నగర ఏఎస్పీ దీక్ష ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు మాట్లా డుతూ, ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు, ప్రలోభాలకి గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించు కోవాలన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు.

31న..నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో 'యూత్ పార్లమెంట్' పోటీలు

ఈనెల 31న నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో యూత్ పార్లమెంట్ పోటీలు నిర్వహించనున్నారు. 'మేరా యువ భారత్ – నెల్లూరు' వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న "వికసిత భారత్ యూత్ పార్లమెంట్" కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. సునీత, నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్, నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. రవి ప్రసాద్‌లతో కలిసి జిల్లా యువజన అధికారి శశికాంత్ రెడ్డి ఈనెల 28న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశికాంత్‌రెడ్డి మాట్లాడుతూ... యువతలో నాయకత్వ పటిమను, పార్లమెంటరీ విధానాలపై అవగాహనను పెంపొం దించేందుకు వికసిత భారత్ యూత్ పార్లమెంట్ ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. ఈ "వికసిత భారత్ యూత్ పార్లమెంట్" జిల్లా స్థాయి కార్యక్రమం ఈ నెల 31వ తేదీన నెల్లూరులోని నారాయణ ఇంజి నీరింగ్ కాలేజ్ ఆవరణలో నిర్వహిస్తామన్నారు. ఈ యూత్ పార్లమెంట్‌లో ప్రధానంగా "వన్ నేషన్ – వన్ ఎలక్షన్" (ఒకే దేశం – ఒకే ఎన్నిక) అనే కీలక అంశంపై యువత తమ ఆలోచనలు, విశ్లేషణలు మరియు అభిప్రాయా లను పంచుకుంటారని వివరించారు. జిల్లాలోని అన్ని కాలేజీల విద్యార్థులు, యువకులు మరియు మేరా యువ భారత్ వాలంటీర్లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలుగుభాషకి ఊపిరి..పద్యమే!

-ప్రముఖ సాహితీవేత్త హరిశంకరశర్మ-

హరిశంకరశర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

తెలుగుభాషకి ఊపిరి పోసింది పద్యమేనని విజయవాడకి చెందిన ప్రముఖ సాహితీవేత్త శ్రీహరి శంకరశర్మ అన్నారు. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహికలో భాగంగా, ఈనెల 25న జరిగిన 178వ ప్రసంగంలో ఆయన 'తెలుగు పద్య వైభవం' అనే అంశంపై ప్రసంగించారు. చెన్నై టీనగర్‌లోని ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశభక్తిని–దైవభక్తిని ప్రేరేపింపజేసి మానవాళికి చక్కని మార్గ దర్శకత్వం కలిగించింది.. ప్రాచీనకాలం నుంచి మన తెలుగు పద్యాలేనన్నారు. ఈ సందర్భంగా తిక్కన, పోతన, శ్రీనాథుడు, నన్నయ వంటి మహాకవుల పద్యాలను, ఆధునిక కవుల పద్యాలను కూడా ఆయన హృద్యంగా గానం చేశారు. అనంతరం వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధులు ఆయన్ను జ్ఞాపికలతో సత్కరించారు. చెన్నైలోని అనేకమంది తెలుగు ప్రముఖులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

'కవన వనం'లో విరబూసిన కవితా సుమాలు

తోట సులోచన నెల్లూరుకి చెందిన కవయిత్రి. విశ్రాంత ఉపాధ్యాయు రాలు. కవిత్వమంటే ఆమెకెంతో ఇష్టం. వ్యక్తిగతంగా ఆమె సౌజన్యమూర్తి. అందర్నీ కలుపుగోలుగా పలుకరిస్తుంది. జనం బాధలు శ్రీశ్రీ బాధలు అన్నట్లు.. అందరి బాధలు ఆమె బాధలు. అన్నీ ఆరాతీస్తుంది. ఉపశమనం పలుకుతుంది. ఆమె తొలుత జీవనరాగాలు (కవితా సంపుటి), శ్రీ సాయి సుమాలు, పసిడి బాల శతకం, నాని సులోచనలు వెలువ రించారు. ప్రస్తుత కవితా సంపుటి పేరు 'కవన వనం'. ఇందులో ఆమె ఇష్టదైవాల మీద కవితలల్లి, సంతృప్తి చెంది తమ కూతురుకు అల్లుడికి మనుమరాళ్ళకు అంకితమిచ్చారు.

జగతిలో ఆదిదేవుడుగా మెరుపులు చిందే స్వామి 'విఘ్నేశ్వరుడు' అని చెప్పు, ఏ కార్యానికైనా తొలిపూజకర్హుడవు నీవేనని నమస్కరిస్తారు 'విఘ్నేశ్వరుడు' కవితలో. 'కులమత బేధము లేక స్నేహభావాలతో అందరు ఆడిపాడెదరు' అనే అం శంతో ఈ కవితను జన జాగృతికి ఉపయోగపడేలా చేయడం ఈమె ప్రత్యేకత. రెండవ కవిత 'వీణాధరి' సరస్వతీదేవిపై సంధించారు. 'హంసవాహినిగా కావ్యరచనతో సాహితీమూర్తిగా ప్రభవించి, సమాజ సంక్షేమమే ధ్యేయంగా అఖండమైన జ్ఞాన దివ్య సంపత్తితో మహోన్నత శిఖరాలపై కూర్చుండబెట్టు శారదాంబ' అని సర్వమత విద్యాధరి సరస్వతీదేవిని స్తుతిస్తారు. మూడవ కవిత తన ఇష్టదైవం 'శిరిడి సాయినాథుడి'పై రాశారు. ప్రపంచమంతా కొలిచే దైవమై నిలచారని చెప్తూ 'మసీదులో నివసించే బాబా భక్తులకు సర్వమత సహనం బోధించు' అంటారు. ఆ లైన్లను కవితాపరం గావిస్తారు.

ఇలా ప్రతి కవితలో తనకు ఇష్టమైన వాక్యాలు రాసుకుంటూ వచ్చినా, ఒకటిరెండు పంక్తులు కవితామయం గావించడంలో నేర్పరి కవయిత్రి తోట సులోచన. నిడివి తగ్గించి, కవితామయం చేయాల్సిన విధానం అలవరుచుకొంటే మంచి కవయిత్రిగా రచనలను అందించగలదు.

'దీపలక్ష్మీ నమోస్తుతే' కవితలో దీపం చలికాలమున ఆరోగ్య లక్ష్మిగా, క్రిమికీటకాలను నశింపజేసి, రోగహరిణిగా ప్రాణులను తల్లిలా కాపాడాలని ఆకాంక్షిస్తూ, చెడుపై మంచి విజయమే దీపావళి పండుగనని చెప్తూ, ప్రతిరోజూ ప్రాతఃకాల సంధ్యా దీపారాధన సకల శుభాల ఆహ్వానమై శోభించు'నని మంచి పల్కులతో ఆశీర్వదిస్తారు. 'ఇదీ నా కథ' కవితతో 'తాను పువ్వులా పెరిగినా, వెట్టి చాకిరీ బానిసయై, చీమలా నిరంతరం శ్రమిస్తూనే, హృదయానికి శరఘాతాలతో తగిలే వేదన కంటిరెప్పల చాటున పొంగిపొరలుతూనే, ఓదార్చే ప్రాణిలేక భగవంతునితో మమేకమేనంటూ తాను ఎలా సంబాళించుకొన్నారో చెప్తారామె. తన గురించి తాను చెప్తూ 'కొండలాంటి గుండె కనుక, ఎన్నిదెబ్బలకైనా చలించక నిలచి, రాలిపోయే ఆకులా తుదిశ్వాస కొరకు వేచియున్నా నిర్వేదనతోనని పలుకుతూ 'పత్రం పుడమిని చేరే దాకా ఈ జీవనయానం సాగాల్సిందే, తప్పదు' అని కాసింత ధైర్యాన్ని పులుముకొని ఆమె చెప్పినట్లు కొండలా నిలవాల్సిన ధైర్యాన్ని మనకి నేర్పిస్తారు.



కవయిత్రి: తోట సులోచన
వెల: రూ. 100/– పేజీలు: 120
ప్రతులకు:
తోట సులోచన
నెల్లూరు.
సెల్: 94901 73053

'మీరు ఏంటోళ్ళు' అన్న కవితలో కులాల ప్రస్తావన తీసుకొస్తారామె. విజ్ఞానం విస్తృతమై, సాంకేతిక జ్ఞానం, అభివృద్ధి చెందిన తరుణంలో 'ఏంటోళ్ళు' అని ప్రశ్నించడం సంస్కార రహితమైన ప్రశ్నగా మిగులుతుందని హితాన్ని బోధిస్తారు. 'సాయం చేసే శక్తి లేకుంటే మౌనంగా సాగిపో / ఏంటోళ్ళు అన్న మాట నీ నుండి రానివ్వకు, అది వివేకానికి, సంస్కారానికి చిరునామా కానేరదు అని హెచ్చరిస్తారు.

ఈమె రాజ్యాల మధ్య యుద్ధాలను కాక శాంతిసౌభాగ్యాలను కోరు కుంటారు. కుటుంబాలు మమతలు పూదోటలుగా విరబూయాలంటారు.

గురువు గారు స్వర్గీయ 'మెట్టు రామచంద్రప్రసాద్' గారిపై రాసిన ఎలిజీ కంటనీరు పెట్టిస్తుంది. మెట్టుగారు లేని సాహితీసభ 'పున్నమి చంద్రుడు లేని ఆకాశంలా వెలవెలబోయేది' అని రామచంద్రప్రసాద్ గారిని కీర్తిస్తారు.

ఈ పుస్తకంలో ఆమె రాయని అంశమంటూ ఏమీలేదు. అందరూ చదవదగ్గ మంచి కవితల పుస్తకం ఇది. సులోచనమ్మకి అభినందనలు.

సమీక్ష:
'కళారత్న' చిన్ని నారాయణరావు
సెల్ : 94402 02942

నిరుపేదలకు 'రూడ్స్' సేవలు

నెల్లూరులోని రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ వారు ఇటీవల నెల్లూరు నగరానికి చెందిన రాజమన్నార్ సహకారంతో అంబాపురం, బ్రహ్మంగారి గుడి ప్రాంతంలో ఉన్న నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ట్రస్టు ఛైర్మెన్ రసూల్, రవిచంద్ర, ఆదిత్య పాల్గొన్నారు.

ఈతకోటకు సతీవియోగం

నెల్లూరుకు చెందిన ప్రముఖ పాత్రికేయుడు.. సాహితీవేత్త ఈతకోట సుబ్బారావు సతీమణి రమాదేవి (ఈతకోట సునీత) ఈనెల 26వ తేదీ వేకువన గుండెపోటుతో హఠాన్మ రణం చెందారు. నెల్లూరు కలెక్టరేట్‌లో దీర్ఘకాలం తహశీల్దార్‌గా పనిచేసి ఇటీవలే ఆమె రిటైరయ్యారు. ఆమె మరణానికి చింతిస్తూ, ఈతకోట సుబ్బారావును పలువురు సాహిత్యాభిమానులు, సాహితీ సంస్థల వారు, రెవెన్యూ శాఖ వారు పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

శ్రద్ధాంజలి



జననం: 18.01.1946 నిర్యాణం: 05.11.2017

స్నేహశీలి, మృదుస్వభావి,
మంచి మనసున్న మహామనీషి, మానవతావాది

కీ॥శే॥ ఆదాల రాఘవరెడ్డి గారు

పరమపదించి తేది. 05.11.2026 నాటికి
తొమ్మిదేళ్ళు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

భార్య
ఆదాల అరుణ
కుమార్తె
ఆదాల సాయి అపర్ణ

కుమారుడు - కోడలు
ఆదాల వంశీకృష్ణ - రచన
మనుమరాళ్ళు
సాయి అనిక, సాయి అవని

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com